

రాజంపేట మండలం సున్నపురాళ్లపల్లె గుట్టపై రోడ్డు సౌకర్యానికి కూడా నోచుకోని జగనన్న కాలనీ

అంతా ఆర్భాటమే..!

- కనీస సౌకర్యాలు లేని జగనన్న కాలనీలు
- రోడ్లు లేవు... నీరు లేదు...
- ఇళ్లెలా కట్టుకోవాలి
- ఆగమేఘాల మీద రిజిస్ట్రేషన్లు
- 30 శాతం కూడా పూర్తి కాని ఇళ్లు

రాజంపేట, ఫిబ్రవరి 18 : జగనన్న పేరిట ఎంతో ఆర్భాటంగా అనేక చోట్ల ఏర్పాటు చేస్తున్న జగనన్న కాలనీలు అసంపూర్తిగా ఉన్నాయి. జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రంలోని పేదలందరికీ సుమారు 30 లక్షల ఇళ్లు నిర్మిస్తున్నట్లు ప్రకటించి ఆర్భాటంగా జగనన్న కాలనీలను ఏర్పాటు చేశారు. అయితే మరో పక్షం రోజుల్లో ఎన్నికల కోడ్ వస్తున్నా ఎక్కడా ఏ జగనన్న కాలనీ కూడా పూర్తి కాలేదు. రాష్ట్రంలోని 30 లక్షల మంది పేదలకు ఇళ్లు కట్టిస్తామన్న జగన్ ప్రకటన ఒట్టి అభూతకల్పనగా మారింది. ఏ కాలనీ కూడా 30 శాతం ఇంటి నిర్మాణాలకు నోచుకోక కాలనీలన్నీ వెలవెలబోతున్నాయి. కొన్ని బేస్‌మెంట్ లెవల్ లోనూ, మరి కొన్ని పునాదుల్లోనూ, మరికొన్ని అసలే మొదలు పెట్టకుండానూ, మరికొన్ని స్లాబ్ లెవల్‌లోనూ నిలిచిపోయాయి. 50 శాతం మంది పైబడి ప్రజలు ఇళ్లు కట్టుకోవడానికి ఆసక్తి చూపక నిలిపివేశారు. ఈ విషయం అటుంచితే జగనన్న కాలనీలకు కనీసం మౌలిక సదుపాయాలు కూడా కల్పించలేదు. కాలనీలు ప్రారంభించేటప్పుడు ఉపాధి హామీ పథకం కింద కొన్ని మట్టి పనులు, రోడ్ల లాంటి పనులు చేశారు తప్ప రోడ్లను ఏర్పాటు చేయలేదు. ఇంటింటికీ కుళాయి అసలే ఏర్పాటు చేయలేదు. విద్యుత్ సౌకర్యం అరకొరగా ఏర్పాటు చేసినా ఆ సమస్య కూడా పూర్తి కాలేదు. మామూలుగా ఒక గ్రామం ఏర్పాటు చేసేటప్పుడు ఆ గ్రామానికి కావాల్సిన కనీస మౌలిక సదుపాయాలు గుడి, బడి, కరెంటు, రోడ్లు, నీరు లాంటి కనీస సౌకర్యాలను ముందుగా ఏర్పాటు చేయాల్సి ఉంది. జగనన్న కాలనీలను ఏర్పాటు చేసేటప్పుడు ఫార్మేషన్ రోడ్లను చూపారు తప్ప ఏ రోడ్డును కూడా ఏర్పాటు చేయలేదు. రోడ్డును ఏర్పాటు చేయకపోవడం వల్ల జగనన్న కాలనీలో అడుగు పెట్టాలన్నా వీలు పడటం లేదు. కరెంటు తీగలు లాగారు తప్ప అందరికీ కరెంటు సౌకర్యాన్ని ఏర్పాటు చేయలేదు. ప్రధానంగా నీటి సౌకర్యాన్ని కల్పించాల్సి ఉంది. అయితే కేవలం కాలనీల వద్ద ఒకటి, రెండు చిన్నపాటి తాత్కాలిక ట్యాంకులు ఏర్పాటు చేసి నీటి సౌకర్యం కల్పించారు తప్ప ఆయా ఇళ్ల నిర్మాణాలకు కావాల్సిన నీటి వసతిని కల్పించలేదు.

ఇటు రోడ్డు, అటు నీటి వసతులు లేక మౌలిక సదుపాయాలన్నీ అక్కడే మరుగునపడిపోయాయి. ప్రధానంగా పశువులు మేపుకోవడానికి తరతరాలుగా ఉన్న పశువుల మేత పచ్చికబైళ్లు, గుట్టలు, ఆవాసంగా చేసుకుని ఈ జగనన్న కాలనీలను ఏర్పాటు చేశారు. పశువుల నోరుగొట్టి అవి మేయడానికి కూడా స్థలం లేకుండా గ్రామాల మధ్య ఉండే గుట్టలను అమాంతం ఖాళీ చేసి ఈ జగనన్న కాలనీలకు శ్రీకారం చుట్టారు. మూడేళ్లుగా ఎక్కడా ఏ కాలనీ కూడా పూర్తి కాలేదు. ఇక ఒక గ్రామం ఏర్పాటు చేసినప్పుడు ఆ గ్రామ పిల్లలకు ప్రధానంగా కావాల్సిన పాఠశాలలను ఏర్పాటు చేయాల్సి ఉంది. ఒక్కో కాలనీలో కేవలం ఒకటిన్నర సెంటు పేరిట వెయ్యి, రెండు వేలు, మూడు వేల ఇళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు స్థలాలు కేటాయించి ఈ జగనన్న కాలనీలకు శ్రీకారం చుట్టారు. అయినా ఎక్కడా ఆ గ్రామ పిల్లలకు కావాల్సిన విద్యావసరాలను ఏర్పాటు చేయలేదు. ఈ విధంగా చెప్పుకుంటూపోతే ఒక గ్రామానికి కావాల్సిన వసతులను ఏమాత్రం ఏర్పాటు చేయలేదు. ఏమీ ఏర్పాటు చేయకుండానే జగనన్న ఇళ్లు పూర్తయ్యాయని, పేదల ఇంటి సాకారం నెరవేరిందని గొప్పలు చెప్పుకోవడం తప్ప అవి ఏమాత్రం కార్యరూపం దాల్చలేదు.

ఒక్క రాజంపేట మండలంలో చూసుకుంటే చుట్టుపక్కల అన్ని గ్రామాల్లో ఈ జగనన్న ఇంటి కాలనీలను ఏర్పాటు చేశారు. అయితే ఎక్కడా కూడా ఏ ఇంటి నిర్మాణాలను పూర్తి చేయలేదు. ప్రధానంగా ఒక్క రాజంపేట మండలానికి వస్తే ఆకేపాడులో 183 గృహాల్లో 100 ఇళ్లు కూడా పూర్తి కాలేదు. అప్పారాజుపేటలో 176 ఇళ్లు, గుండ్లూరులో 76 ఇళ్లు, హస్తవరంలో 103 ఇళ్లు, బోయనపల్లెలో 202 ఇళ్లు, కొల్లావారిపల్లెలో 57 ఇళ్లు, కూచివారిపల్లెలో 164 ఇళ్లు, కూచివారిపల్లె-2లో 127 ఇళ్లు, మదనగోపాలపురంలో 342 ఇళ్లు, మందపల్లెలో 188 ఇళ్లు, మందరంలో 104 ఇళ్లు, మిట్టమీదపల్లెలో 44 ఇళ్లు, పెద్దకారంపల్లెలో 226 ఇళ్లు, పోలిలో 75 ఇళ్లు, పులపత్తూరులో 431 ఇళ్లు, బుడుగుంటపల్లెలో 63 ఇళ్లు, కొత్తపల్లెలో 113 ఇళ్లు, ఊటుకూరులో 219 ఇళ్లు, వరదయ్యగారిపల్లెలో 101 ఇళ్లను పూర్తి చేయాల్సి ఉండగా ఎక్కడా కూడా 30 శాతం కూడా పూర్తి కాలేదు.

ప్రధానంగా అన్నమయ్య వరద బాధిత ప్రాంతాలైన పులపత్తూరు లేఅవుట్-1, 2, 3 చోట్ల 308 ఇళ్లను పూర్తి చేయాల్సి ఉండగా కనీసం ఇప్పటి వరకు 50 శాతం ఇళ్లు కూడా పూర్తి కాలేదు. అదేప్రకారం వరద ప్రభావిత ప్రాంతమైన తొగూరుపేటలో 79 ఇళ్లు, రామచంద్రాపురంలో 47 ఇళ్లు, మందపల్లెలో 7 ఇళ్లు, శేషమాంబపురంలో 5 ఇళ్లు ఈ ప్రకారం ఆ ప్రాంతంలో 446 ఇళ్లు పూర్తి చేయాల్సి ఉండగా ఇంతవరకు పూర్తి కాలేదు. దేశంలోనే అత్యంత విషాదకర సంఘటన అయిన అన్నమయ్య డ్యాం తెగిపోవడం, అందులో 40 మంది చనిపోవడం, 450 పక్కా గృహాలు నీటిలో కొట్టుకుపోవడం జరిగింది. సంఘటన జరిగి రెండు సంవత్సరాల నాలుగు నెలలు అవుతున్నా ఇంతవరకు వారికి పునరావాస చర్యల కింద ఇళ్లు నిర్మించాలన్న ఆలోచన ఈ ప్రభుత్వానికి లేదంటే ఇక మామూలు పేద ప్రజలకు ఏమాత్రం ఇళ్లు కట్టిస్తారో సులభంగా అర్థం చేసుకోవచ్చు. వరద ప్రభావిత ప్రాంతాల్లో 450 ఇళ్లు పూర్తి చేయాల్సి ఉండగా అందులో 50 శాతం ఇళ్లు కూడా పూర్తి చేయలేకుండా ఆ కాలనీలకు కావాల్సిన సౌకర్యాలైన రోడ్డు, విద్యుత్ లాంటి కనీస సౌకర్యాలను ఏమాత్రం ఏర్పాటు చేయకపోవడం శోచనీయం.

ప్రధానంగా నిధులలేమి జగనన్న కాలనీలకు శాపంగా మారింది. ఎప్పటికప్పుడు పేద ప్రజలు కట్టుకునే ఇళ్లకు ఇవ్వాల్సిన బకాయిలను వెనువెంటనే చెల్లిస్తే వారు ఇల్లు కట్టుకోవడానికి వీలుంటుంది. ఒక్కో గృహానికి 1.80 లక్షలను ప్రభుత్వం చెల్లించాల్సి ఉంటుంది. మామూలుగా ఒక చిన్నపాటి జగనన్న ఇంటి నిర్మాణం చేపట్టాలంటే కనీసం ఆ పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు 10 లక్షలు అవసరం అవుతుంది. అందులో ప్రభుత్వం ఇచ్చేది కేవలం రూ.1.80 లక్షలు వారి పునాదులకు కూడా సరిపోదు. ఆ స్థితిలో ఆ సొమ్ము కూడా చెల్లించే పరిస్థితిలో ప్రభుత్వం లేకపోవడం, 70 శాతం ఇళ్లు కట్టుకోలేని పరిస్థితుల్లో పేద ప్రజలు ఈ జగనన్న ఇంటి నిర్మాణాలపై అనాసక్తి చూపి ఎక్కడికక్కడే నిలిపివేశారు. కనీసం మౌలిక వసుతలు లేక కొండలు, గుట్టలపై ఏర్పాటు చేస్తున్న ఇళ్లకు ఆగమేఘాల మీద రిజిస్ట్రేషన్లు చేసుకోమని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది.

మౌలిక వసతులకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం..

జగనన్న కాలనీలను ప్రారంభించేటప్పుడు ఉపాధి హామీ పథకం కింద రోడ్ల ఫార్మేషన్ ఏర్పాటు చేశాము. ఇంకా సిమెంటు రోడ్లు వేయలేదు. కరెంటు, నీటి వసతిని ఏర్పాటు చేశాము. జగనన్న ఇంటి నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నాము.

- మురళి, డీఈ, హౌసింగ్



పునాదులకే పరిమితమైన జగనన్న ఇళ్లు



అర్ధాంతరంగా ఆగిపోయిన జగనన్న ఇళ్లు



పులపత్తూరు ప్రాంతంలో పూర్తి కాని జగనన్న ఇళ్లు

జగనన్న కాలనీలంతా బూటకమే..



జగనన్న కాలనీలనేవి అంతా బూటకమే. రాజంపేట మండలంలోనే అనేక గుట్టలను చదును చేసి జగనన్న కాలనీల పేరిట సుమారు 20 చోట్ల ఇంటి నిర్మాణాలు చేపట్టారు. ఎక్కడా కూడా 50 శాతం ఇళ్లు పూర్తి కాలేదు. రాజంపేట ప్రాంతంలో ఏ కాలనీ పూర్తయ్యిందో అధికారులే లెక్కలు చెప్పాల్సి ఉంది. కాలనీల్లో కనీస మౌలిక సదుపాయాలైన రోడ్లు, కరెంటు, నీళ్ల సౌకర్యం కూడా ఏర్పాటు చేయలేని పరిస్థితుల్లో ప్రభుత్వం ఉంటే ఇక లబ్ధిదారులకు ఏమాత్రం పైసలేస్తారో అర్థం చేసుకోవచ్చు. ఇది కేవలం రాజకీయ లబ్ధి కోసం ఏర్పాటు చేస్తున్న కాలనీలే ప్రజల కోసం కాదు.

- కొల్లు రెడ్డెయ్యనాయుడు, రాజంపేట టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి

ఇంటి నిర్మాణాలు కాగితాలకే పరిమితం..



జగనన్న కాలనీల పేరిట రాజంపేట ప్రాంతంలో అనేక చోట్ల గుట్టలను చదును చేసి పనులు ప్రారంభించారు తప్ప అది ఒక్కటి కూడా పూర్తి కాలేదు. ఇంత భారీ స్థాయిలో కాలనీలను ఏర్పాటు చేసేటప్పుడు పేద ప్రజలకు కావాల్సిన ఆర్థిక వనరులను, మౌలిక వసతులను ఏర్పాటు చేయాల్సి ఉండగా ఏదీ పట్టించుకోలేదు. ప్రధానంగా లబ్ధిదారులకు వేయాల్సిన 1.80 లక్షలను కూడా చెల్లించే పరిస్థితుల్లో ప్రభుత్వం లేనప్పుడు ఈ ఇంటి నిర్మాణాలను ఎలా చేపడతారో అర్థం చేసుకోవచ్చు. కావున రాజంపేట ప్రాంతంలో జగనన్న ఇంటి నిర్మాణాలన్నీ కాగితాలకే పరిమితమయ్యాయి.

- మనుబోలు వెంకటేశ్వర్లు, మాజీ కౌన్సిలర్, రాజంపేట

30శాతం నిర్మాణాలు పూర్తి కాలేదు..



రాజంపేట ప్రాంతంలో 30 శాతం జగనన్న ఇంటి నిర్మాణాలు కూడా పూర్తి కాలేదు. కొందరు డబ్బులున్నవాళ్లే బినామీల పేరిట ఈ జగనన్న కాలనీలను దక్కించుకుని అక్కడక్కడా ఇంటి నిర్మాణాలు పూర్తి చేశారు తప్ప అసలైన లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలు చేపట్టలేదు. కారణం ఒక ఇల్లు పూర్తి చేయాలంటే కనీసం 10 లక్షల రూపాయలు అవసరమవుతుంది. అందుకు ప్రభుత్వం కేవలం 1.80 లక్షలు మాత్రమే ఇస్తుంది. మిగిలిన 8 లక్షల రూపాయలు పేదలు ఎక్కడి నుంచి తెచ్చుకోవాలి. పేద ప్రజలు అనాసక్తి చూపడం వల్ల 30 శాతం ఇళ్లు కూడా పూర్తి కాలేదు. కావున జగనన్న ఇంటి నిర్మాణాలన్నీ అభూతకల్పనగానే మారిపోయాయి.

- వేణుగోపాల్‌రాజు, ఊటుకూరు గ్రామం

సిద్ధం.. ఎంత కష్టం

- బస్సులు లేక.. జనం అగచాట్లు
- పలుచోట్ల నైట్ సర్వీసులు రద్దు
- బైకులు, ఆటోలలో జనం



బస్సులు లేక నిర్మానుష్యంగా ఉన్న కలికిరి బస్టాండు

రాయచోటి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా రాప్తాడులో జరిగిన ముఖ్యమంత్రి సిద్ధం సభతో ఆదివారం జిల్లా వ్యాప్తంగా ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జిల్లాలో 335 ఆర్టీసీ బస్సులు సిద్ధం కార్యక్రమానికి వెళ్లాయి. దీంతో ఎక్కడికక్కడ ప్రజలు అగచాట్లు పడ్డారు. జిల్లాలో ప్రధానంగా రాయచోటి, మదనపల్లె, పీలేరు, రాజంపేట, రైల్వేకోడూరు పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాలకు కూడా రోజూ మాదిరి బస్సు సర్వీసులు నడవలేదు. అసలే పెళ్లిళ్ల సీజను కావడంతో బస్సుల కోసం గంటల కొద్దీ ప్రయాణీకులు ఎదురు చూశారు. శనివారం మధ్యాహ్నం నుంచే ఆర్టీసీ బస్సులు వైసీపీ నాయకుల ఆధీనంలోకి వెళ్లడంతో శనివారం రాత్రి నుంచే పల్లెలకు వెళ్లే నైట్ హాల్ట్ సర్వీసులు పూర్తిగా రద్దు చేశారు. దీంతో జనం తీవ్ర అగచాట్లు పడ్డారు. బస్సులు లేక ప్రయాణాలు తప్పనిసరి కావడంతో బైకులు, కార్లు, జీపులపైన ఆధారపడ్డారు. బస్సులు లేకపోవడంతో జిల్లాలోని పలు ఆర్టీసీ బస్టాండులు వెలవెలపోయాయి. రాయచోటి బస్టాండు బయటి ప్రాంతాల నుంచి వచ్చే వారితో రద్దీగా ఉంటుంది. అయితే రాయచోటి డిపో నుంచి 86 బస్సులు సిద్ధం కార్యక్రమానికి తరలిపోవడంతో ఆదివారం పూర్తిగా వెలవెలబోయింది. చుట్టుపక్కల పల్లెలకు సైతం బస్సులు వెళ్లకపోవడంతో బజారులో సైతం జనం రద్దీ తక్కువగా కనిపించింది. పీలేరు డిపోలో 62 బస్సులు వెళ్లాయి. దీంతో ఆదివారం ఉదయం నుంచి ప్రయాణీకులు ఇబ్బందులు పడ్డారు. బస్సుల కోసం గంటల కొద్దీ ప్రయాణీకులు వేచి చూశారు. బస్సులు రాకపోవడంతో పీలేరు నాలుగురోడ్ల కూడలి నుంచి ప్రైవేటు వాహనాల్లో ప్రయాణాలు కొనసాగించారు. కలికిరి, వాల్మీకీపురం ఆర్టీసీ బస్టాండుల్లో ఇదే పరిస్థితి కనిపించింది. మదనపల్లెలో ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాలు సైతం సిద్ధం కార్యక్రమానికి వెళ్లడంతో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బస్సులు అందుబాటులోకి రాకపోవడంతో ములకలచెరువు, సీటీఎం రైల్వేస్టేషన్లలో రైళ్లను ఆశ్రయించారు. గుంతకల్లు, ధర్మవరం నుంచి మొదలయ్యే రైళ్లు కూడా ప్రయాణీకులతో రద్దీగా కనిపించాయి. అత్యవసర పనుల మీద బెంగళూరు, తిరుపతి వంటి ప్రాంతాలకు వెళ్లేవారు కార్లు బాడుగకు మాట్లాడుకుని వెళ్లారు. దీంతో జగనన్న సిద్ధం సభతో ప్రజలకు కష్టాలు తప్పలేదు.

విలేఖరిపై దాడి చేసిన వైసీపీ రౌడీలను కఠినంగా శిక్షించాలి

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేశ్‌నాయుడు



వైసీపీ మూకల దాడిలో గాయపడ్డ ఫొటోగ్రాఫర్ కృష్ణ

రాజంపేట, ఫిబ్రవరి 18 : వైసీపీ ఆధ్వర్యంలో రాప్తాడులో జరిగిన బహిరంగ సభ మీడియా కవరేజ్‌కు వెళ్లిన ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ కృష్ణపై దాడి చేసిన వైసీపీ అల్లరిమూకలపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేశ్‌నాయుడు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫొటోగ్రాఫర్ కృష్ణపై దాడి చేయడాన్ని బీజేపీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ప్రజాస్వామ్యంలో మీడియాపై దాడులు చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. ప్రజాస్వామ్యంలో రాజకీయ పార్టీలు తమకు, తమ పార్టీకి నచ్చిన విషయాలను మీడియా కవర్ చేయాలని అనుకోవడం సరైంది కాదన్నారు. ఇటువంటి దాడులను ప్రజాస్వామ్యవాదులందరూ ఖండించాలన్నారు. వేలాది మంది పాల్గొన్న ఈ సభలో ఒక్కడిని చేసి అంతమంది పోలీసుల ఎదుటే దాడి చేస్తుంటే వారు ప్రేక్షకపాత్ర వహించడం దారుణమన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎదుర్కోవాలే తప్ప ఇటువంటి దాడులు చేయడం సరైన పద్ధతి కాదన్నారు. ఇదేనా మీ నాయకుడు మీకు నేర్పిస్తున్న నాయకత్వ లక్షణాలు అని ఆయన ప్రశ్నించారు.

పల్లెల గొంతెండుతోంది

- వేసవి రాకముందే తాగునీటి కష్టాలు
- నిధులు లేవంటున్న సర్పంచులు
- వ్యవసాయ బోర్ల వద్దకు మహిళల పరుగు



రూ.40 లక్షలతో నిర్మించి ఉపయోగపడని తాగు నీటి ట్యాంకు



వ్యవసాయ బోర్ల దగ్గర నుంచి తాగునీరు తెచ్చుకుంటున్న వాయలొడ్డు బిడికి మహిళలు



ప్రభుత్వ నిధులతో వేసిన బోరులో నీరుపడినా నిరుపయోగంగా ఉన్న దృశ్యం

సుండుపల్లె, ఫిబ్రవరి 18: వేసవి రాకముందే ప్రజలు తాగునీటికి కష్టాలు పడుతున్నారు. వ్యవసాయ బోర్ల వద్దకు తాగునీటి కోసం మహిళలు పరుగులు తీస్తున్నారు. సుండుపల్లె మండల ప్రజలను తాగునీటి కష్టాలు వెంటాడుతున్నాయి. ప్రతియేటా ఏప్రిల్, మే నెలల్లో మండల వ్యాప్తంగా పలు గ్రామ పంచాయతీల్లో తాగునీటి కోసం ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. అయితే ఈ ఏడాది ఫిబ్రవరి నెల నుంచే తాగునీటి సమస్య ప్రారంభం కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీల అభివృద్ధికి నిధులు విడుదల చేయకపోవడం, కేంద్రం నుంచి వస్తున్న నిధులను సైతం రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవడంతో సర్పంచులు చేతులెత్తేశారని స్పష్టంగా తెలుస్తోంది. తాగునీటి సమస్య ఉందని గ్రామస్థులు చెప్పడంతో ట్యాంకుల ద్వారా సైతం ప్రజలకు నీరందించామని, ప్రభుత్వం నిధులు రాకపోతే ఎన్ని రోజులు అప్పు చేసి గ్రామ పంచాయతీల్లో సమస్యలు పరిష్కరించగలమని కొంతమంది సర్పంచ్‌లు వాపోతున్నారు. అరకొరగా వచ్చిన నిధులను కరెంటు బిల్లుల రూపంలో లాక్కున్నారని చెబుతున్నారు. మండలంలోని మారెడ్డిగారిపల్లె గ్రామ పంచాయతీ వాయలొడ్డు బిడికీలో సుమారు 130 కుటుంబాలు ఉన్నాయి. తాగునీటి కోసం ప్రతిరోజూ అష్టకష్టాలు పడాల్సిన పరిస్థితి ఎదురవుతోందని గ్రామస్థులు చెబుతున్నారు. గ్రామంలో రెండు బోర్లు ఉన్నా రోజుకు కనీసం గంటసేపు కూడా నీరు రాని పరిస్థితి ఉందని స్థానికులు చెబుతున్నారు. ఇంటికి కనీసం 5 బిందెలు నీరు రాకపోతే ఎలా కాలకృత్యాలు తీర్చుకోవాలి, ఏం తాగాలని మహిళలు వాపోతున్నారు. చిన్నగొల్లపల్లి గ్రామ పంచాయతీలో తాగునీటి కష్టాలు తారాస్థాయిలో ఉన్నాయి. బోర్లు వేసినా కూడా ఇక్కడ చుక్క నీరు పడే పరిస్థితి కనిపించడం లేదు. స్థానిక సర్పంచ్ సుమారు 900 అడుగుల వరకు రెండు బోర్లు వేస్తే ఒక బోరులో ఒక ఇంచు నీరు పడ్డాయని చెబుతున్నారు. అలాగే జలజీవన్ నిధులతో నాలుగు బోర్లు వేయగా రెండు బోర్లలో నీరు పడినట్లు చెబుతున్నారు. గతంలో కొన్ని బోర్లు 300 అడుగుల వరకు వేశారు. అయితే వాటిలో సరిగ్గా నీరు రావడం లేదు. రీబోర్ చేస్తే నీరు పడే అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు. ముఖ్యంగా రామావాండ్లపల్లె, బొల్లువాండ్లపల్లె, చిన్నగొల్లపల్లె, కోమటిపల్లె, మల్లప్పగారిపల్లె, జంగంపల్లె, సర్రెడ్డిగారిపల్లెల్లో తాగునీరు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్థానిక సర్పంచ్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ బోర్ల దగ్గరికి వెళ్లి నీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని స్థానికులు చెబుతున్నారు.

అలాగే తిమ్మసముద్రం గ్రామ పంచాయతీ బురుజుకాడ రెడ్డివారిపల్లెలో 40 కుటుంబాలు ఉన్నాయి. బోరులో అరకొరగా తాగునీరు ఉన్నా పైపులు పగిలిపోవడంతో మురికినీరు వస్తోంది. ఆ నీరు తాగాలంటే ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు చెబుతున్నారు. మరికొన్ని పల్లెల్లో తాగునీటి సమస్యలు ఉన్నాయి. మడితాడు గ్రామ పంచాయతీలో వానరాచపల్లె, వానరాచపల్లె ఎగువబిడికి, కొలిమిట్టపల్లెల్లో తాగునీటి సమస్య ఉందని స్థానికులు చెబుతున్నారు. జి.రెడ్డివారిపల్లె గ్రామ పంచాయతీలో తాగునీటి సమస్యలు పరిష్కరిస్తున్నామని సర్పంచ్ చెబుతున్నారు. అయితే రాను రాను అన్ని పల్లెల్లో తాగునీటి సమస్య ఏర్పడే అవకాశం ఉందని ప్రతి ఏడాది ఈ గ్రామంలో తీవ్రమైన తాగునీటి ఎద్దడి ఏర్పడుతోందని స్థానికులు చెబుతున్నారు. పొలిమేరపల్లె గ్రామ పంచాయతీలో గత నాలుగు నెలల నుంచి తాగునీటి సమస్య తీవ్రంగా మారింది. ట్యాంకర్ల ద్వారా తాగునీటిని అందించడం, నీరు పడే అవకాశం ఉన్నచోట బోర్లు వేస్తున్నామని చాలా చోట్ల నీరుపడే అవకాశం లేదని స్థానిక సర్పంచ్ చెబుతున్నారు. అయితే ఈ గ్రామ పంచాయతీ మిట్ట ప్రాంతంలో ఉండడం వలన ఎటువంటి నీటి వసతులు లేకపోవడం వలన వేసవిలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని చెబుతున్నారు.

సుండుపల్లె, ఈడిగపల్లె, గుండ్లపల్లి గ్రామ పంచాయతీల్లోనూ తాగునీటి సమస్యలు తలెత్తుతున్నాయి. పెద్ద గ్రామ పంచాయతీలు కావడంతో స్థానికంగా సర్పంచ్ లేకపోవడం ప్రజలకు పెద్ద సమస్యగా మారింది. ఇక్కడ ఎన్నికలు జరగకపోవడం వలన సర్పంచ్ లేరు. నిధుల కొరత వలన పంచాయతీలో ఎక్కడి సమస్యలు అక్కడే కొలువుదీరాయి. రాయవరం, ముడుంపాడు, భాగంపల్లి గ్రామ పంచాయతీల్లో అరకొరగా తాగునీటి సమస్యలు ఉన్నాయి. రానున్న వేసవిలో నీటి సమస్య మరింత తీవ్రంగా ఏర్పడే అవకాశం ఉందని స్థానిక ప్రజలు చెబుతున్నారు. మండల ప్రజలకు శాశ్వత తాగునీటి పరిష్కారం కావాలంటే రోళ్లమడుగు నుంచి తెలుగుదేశం ప్రభుత్వంలో ఇంటింటికీ తాగునీటి కుళాయి ఏర్పాటు చేయాలని ప్రారంభించిన పథకాన్ని పూర్తి చేస్తే వందశాతం తాగునీటి సమస్యలను పరిష్కరించవచ్చునని ప్రజలు, అధికారులు, టీడీపీ నాయకులు చెబుతున్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి..

గ్రామ పంచాయతీల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నాము. స్థానికంగా ప్రజాప్రతినిధుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి వారి సహకారంతో పరిష్కరిస్తాము. నిధుల కొరత ఉంది. రాను రాను సుండుపల్లె మండలంలో తాగునీటి సమస్య మరింత ఎక్కువయ్యే అవకాశం ఉంది. ముందస్తుగా ప్రత్యామ్నాయం ఏర్పాట్లు చేస్తాము.

- ప్రసాద్, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్

నీరు ఉన్నా నిరుపయోగమే...

మాచిరెడ్డిగారిపల్లె గ్రామ పంచాయతీలో ప్రజలకు తాగునీటి వసతి కల్పించేందుకు జలజీవన్ నిధులతో బోరు వేశారు. నీళ్లు పడ్డాయి. అయితే ఊరికి దూరంగా బోరు వేయడం, అక్కడ నుంచి పైపులైన్ ఏర్పాటు చేయకపోవడం వలన వేసిన బోరు నిరుపయోగంగా మారింది. సుమారు మూడు నెలలు అవుతున్నా ఇప్పటి వరకు పైపులైన్ ఏర్పాటు చేసి ప్రజలకు నీరు అందంచలేని పరిస్థితి ఏర్పడింది. నేడో, రేపో పైపులైన్ ఏర్పాటు చేస్తామని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు చెబుతున్నారు. గ్రామీణ మంచినీటి సరఫరా, పారిశుధ్యశాఖల ఆధ్వర్యంలో నాబార్డు నిధులతో గ్రామీణ మంచినీటి సరఫరా, పారిశుధ్య శాఖ ఆధ్వర్యంలో నాబార్డు నిధులతో 4 వేల లీటర్ల ట్యాంకు నిర్మాణం చేశారు. ట్యాంకుకు నీరు నింపితే సుమారు 100 కుటుబాలకు నీరు అందించవచ్చు కానీ ఉపయోగంగా తిమ్మసముద్రం గ్రామ పంచాయతీ సర్రెడ్డిగారిపల్లెలో చేతి పంపు ఉంది. ఈ చేతి పంపులో నీరు ఉన్నా దానిని మరమ్మతులు చేసేందుకు అధికారులు ముందుకు రావడం లేదని, రిపేరు చేయించాలని ప్రజలు కోరుతున్నారు. ఇదేవిధంగా నీరు ఉన్న పైపులైన్లు ఏర్పాటు చేయకపోవడంతో పలు గ్రామ పంచాయతీల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

బోర్లలో నీరు రావడం లేదు..



బోర్లలో ఇప్పటి నుంచే చుక్కనీరు రావడం లేదు. రాను రాను గ్రామ పంచాయతీలో తాగునీటి సమస్య మరింత ఎక్కువ అవకాశం ఉంది. ఇప్పటికే మహిళలు వ్యవసాయ బోర్ల నుంచి తాగునీరు తెచ్చుకుంటున్నారు. చిన్నగొల్లపల్లెలో ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రోళ్లమడుగు నుంచి తాగునీరు అందించాలి.

- వెంకటయ్య, చిన్నగొల్లపల్లి

వ్యవసాయ బోర్లేగతి..



చాలా రోజుల నుంచి తాగునీటి సమస్య ఉంది. ఉన్న బోరులో అరకొరగా నీరు వస్తోంది. నీరు పల్లె మొత్తానికి సరిపోవడం లేదు. వ్యవసాయ బోర్లు దగ్గరికి వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నాము. కొంతమంది ముసలివాళ్లు నీరు తెచ్చుకునేందుకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. తాగునీటి సమస్య పరిష్కరించి పుణ్యం కట్టుకోండి.

- సుగుణమ్మ, వాయలొడ్డు బిడికి


అధికారంలోకి రాగానే రోళ్లమడుగుకు నీరు..



తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే రోళ్లమడుగు నీటి పథకం పనులు ప్రారంభిస్తాము. ప్రతి ఇంటికి తాగునీటి కుళాయి ఏర్పాటు చేయాలని ఈ పథకాన్ని టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రారంభించారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ప్రజల సమస్యను పట్టించుకోలేదు. ఈ పథకం పూర్తయితే మండలంలో అన్ని గ్రామ పంచాయతీలకు తాగునీరు అందించవచ్చు. తాగునీటి సమస్య ఉందని మహిళలు చెబుతున్నారు. ఎన్నికల తర్వాత నీటి పథకం పనులు ప్రారంభిస్తాము.

- చమర్తి జగన్‌మోహన్‌రాజు, టీడీపీ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు

రానున్న ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెబుతారు..



మండల ప్రజల దాహార్తి తీర్చేందుకు ప్రారంభించిన రోళ్లమడుగు నీటి పథకాన్ని వైసీపీ ప్రభుత్వం విస్మరించింది. ఎన్నికల్లో తాగునీటి పథకం పూర్తి చేస్తామని ఓట్లు వేయించుకున్న వ్యక్తులు నేడు ప్రజా సమస్యలను పట్టించుకోకపోవడం హాస్యాస్పదంగా ఉంది. రానున్న ఎన్నికల్లో సుండుపల్లె మండల ప్రజలు వైసీపీకి తగిన గుణపాఠం చెబుతారు. టీడీపీ అధికారంలోకి రాగానే ప్రతి ఇంటికి తాగునీటి కుళాయి ఏర్పాటు చేయాలన్న టీడీపీ అధినేత చంద్రబాబు ఆశయాన్ని పూర్తి చేసి తాగునీటికి శాశ్వత పరిష్కారం చూపుతాము.

- సుగవాసి బాలసుబ్రమణ్యం, టీడీపీ రాజంపేట పార్లమెంట్ నాయకుడు

విద్యార్థులకు కృషి, పట్టుదల అవసరం

జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారి డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి



విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

వల్లూరు, ఫిబ్రవరి 18 : లక్ష్య సాధనకు విద్యార్థులకు కృషి పట్టుదల ఎంతో అవసరమని జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారి డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వల్లూరు మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని ప్రభాకర్‌రెడ్డి, జిల్లా గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంటు అధికారి విజయలక్ష్మి సందర్శించారు. విద్యార్థులతో మమేకమై స్ఫూర్తిదాయకమైన ప్రేరణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ నేటి ఓటమిని రేపటి విజయానికి నాందిగా భావించి సమాజంలో ఎదురయ్యే సమస్యలు, అవమానాలను పాజిటివ్ దృక్పథంతో ఎదుర్కోవాలన్నారు. జిల్లా గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంటు అధికారి విజయలక్ష్మి మాట్లాడుతూ అమ్మాయిలు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు చేరుకోవడానికి చదువు, సంస్కారం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం ప్రధానోపాధ్యాయురాలు నాజీమున్నీసా, ఉపాధ్యాయురాలు లక్ష్మీదేవి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులపై పాలకుల అలసత్వం బాధాకరం



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

కడప (మారుతీనగర్), ఫిబ్రవరి 18 : దివ్యాంగుల పట్ల ప్రభుత్వాలు తీవ్ర అలసత్వం ప్రదర్శిస్తున్న తీరు బాధాకరంగా ఉందని భారత్ దివ్యాంగ్ పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు కె.చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు ఎం.వెంకటరామరాజు అన్నారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 60 లక్షలకు పైగా దివ్యాంగులున్నారని, వీరి హక్కులు, సంక్షేమం, రక్షణ గురించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు నిరసనగా దివ్యాంగుల ఆత్మగౌరవం, ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా భారత్ దివ్యాంగ్ పార్టీ ఆవిర్భావం జరిగిందన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలకు పోటీ చేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా గతంలో తమ ఓట్లతో గద్దెనెక్కిన పాలకులు తమ సమస్యలను ఏమాత్రం ఖాతరు చేయకుండా వారి సొంత ఆస్తుల పెంపుదల కోసం పాకులాడారే తప్ప తమకంటూ చేసిందేమీ లేదన్నారు. చాలామంది దివ్యాంగులు పెన్షన్ డబ్బులతో కాలం గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇతరులకు ఎలాంటి హాని తలపెట్టలేని దివ్యాంగుల పట్ల పాలకులు చిన్నచూపు చూడడం దారుణమన్నారు. కావున దివ్యాంగులతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల ప్రజలు తమకు మద్దతివ్వాలని కోరారు. అనంతరం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. బీడీపీ జిల్లా నూతన అధ్యక్షుడిగా కె.సుబ్బరామయ్య, ఉపాధ్యక్షుడిగా మల్లికార్జున, ప్రధాన కార్యదర్శిగా సుధాకర్, సహాయ కార్యదర్శిగా షాకీర్, జాషువ, ట్రెజరర్‌గా నరాల శివశంకర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా ఖాదర్‌ఖాన్, పి.రాజన్న, మారుతి, తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బీడీపీ సీనియర్ నాయకులు సుబ్బనరసారెడ్డి, అబ్దుల్‌ఖాదర్, ఖాదర్‌బాష, వెంకటప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దాం

అన్నమయ్య జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కొండయ్య

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 18: పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దామని వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కొండయ్య ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మార్చి 3వ తేదీ ఆదివారం పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమం ఉంటుందన్నారు. అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి 5 సంవత్సరాలలోపు పిల్లలందరికీ ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలియో చుక్కలు వేస్తారన్నారు. ఇప్పటికే ఈ కార్యక్రమంలో పాల్గొననున్న 4,961 మంది సిబ్బందికి శిక్షణ ఇచ్చామన్నారు. జిల్లా వ్యాప్తంగా 5 సంవత్సరాలలోపు పిల్లలు లక్ష 93 వేల 946 మందిని నమోదు చేసి వారందరికీ పోలియో చుక్కలు వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 1602 పోలియో చుక్కల కేంద్రాలు, 207 రూట్‌లను ఏర్పాటు చేశామన్నారు. అలాగే బస్టాండు, రైల్వేస్టేషన్‌లలో 45 పోలియో చుక్కల కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

ఇటుక బట్టీల దగ్గర, భవనాల నిర్మాణం జరిగే చోట, మురికివాడల్లో నివసించే చోట, ఫ్లైఓవర్‌ల కింద నివసించే చోట, రహదారి పనులు జరిగే చోట, సంచార జాతుల వారు, చేపలు పట్టు వారు, సంతల్లో, వ్యవసాయ పొలాల్లో పనులు చేసుకునే చోట, రాళ్లు, బండలు కొట్టే చోట నివాసం ఉండే ప్రాంతాలను 181 గుర్తించామని, ఇక్కడ నివాసం ఉండే వారి పిల్లలకు పోలియో చుక్కలు వేయడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఒకవేళ మార్చి 3వ తేదీ పోలియో చుక్కలు వేసుకోకుండా తప్పిపోయిన పిల్లలకు మార్చి 4, 5 తేదీల్లో బూత్ పరిధిలో నలుగురు సిబ్బంది, రెండు బృందాలుగా ఏర్పడి ప్రతి ఇంటికి వెళ్లి విచారించి బిడ్డలకు పోలియో చుక్కలు వేసి వారి ఇంటిపైన మార్కింగ్ చేస్తారని తెలిపారు. పోలియో కార్యక్రమానికి అనుబంధ శాఖలైన విద్యాశాఖ, స్త్రీ శిశు సంక్షేమశాఖ, పంచాయతీరాజ్, విద్యుత్, రెవెన్యూ శాఖల అధికారులు, స్వచ్ఛంద సేవా సంస్థలు జాతీయ సామూహిక పోలియో చుక్కల కార్యక్రమంలో పాల్గొని పోలియో రహిత సమాజ స్థాపన లక్ష్యాన్ని సాధించడానికి భాగస్వాములు కావాలని డీఎంహెచ్‌వో పిలుపునిచ్చారు.

నేడు కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం

రాయచోటి (కలెక్టరేట్), ఫిబ్రవరి 18: ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు ఈనెల 19వ తేదీ సోమవారం ఉదయం 10 గంటల నుంచి జగనన్నకు చెబుదాం-స్పందన అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటితో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కూడా యధావిధిగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్జీదారులు తమ విజ్ఞప్తులకు సంబంధించి గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. ముఖ్యంగా మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కానీ అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే స్పందనకు రావాలని తెలిపారు.

రెడ్డెమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

గుర్రంకొండ, ఫిబ్రవరి 18:సంతానలక్ష్మీగా పేరుగాంచిన రెడ్డెమ్మకొండ ఆలయంలో ఆదివారం అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను చేశారు. అనంతరం అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలను చేశారు. అమ్మవారు సంతాన లక్ష్మీ కావడంతో వివిధ ప్రాంతాల నుంచి మహిళా భక్తులు అధికంగా వచ్చి ఆలయంలో సంతానం కోసం వరపడ్డారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

పైన పటారం.. లోన లొటారం...

- పైకి ఏపుగా పెరిగిన కట్టె.. ఊడలు దిగని వైనం
- తెగుళ్లతో తగ్గిన వేరుశనగ పంట దిగుబడి
- తీవ్రంగా నష్టపోనున్న రైతులు
- నష్టపరిహారం అందించాలని రైతుల విజ్ఞప్తి



పేరంపల్లెలో సాగుచేసిన వేరుశనగ పంట

గాలివీడు, ఫిబ్రవరి 18: మండలంలో ప్రజలకు ప్రధాన ఆదాయ వనరు వేరుశనగ. ఆ పంటపై మూడొంతుల మంది రైతులు ఆధారపడి జీవిస్తున్నారు. ఒకప్పుడు రైతు రారాజుగా పేరు పొందిన వేరుశనగ నేడు అదే రైతుకు శాపంగా మారుతోంది. లక్షలు ఖర్చు చేసి సాగు చేసిన పంట తెగుళ్లతో రైతులను భిక్షాధికారిగా మారుస్తోంది. పంట చూస్తే ఏపుగా పచ్చగా ఉన్నా లోపల కాయలు మాత్రం రావడం లేదు. కాయల దిగుబడి తగ్గడంతో రైతులు నష్టాల పాలవుతున్నారు. చేసేది ఏమీలేక రైతులు ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తున్నారు. మండలంలో ఖరీఫ్, రబీ సీజన్లలో వేరుశనగను సాగు చేయడం రైతులకు ఆనవాయితీ. కానీ 10 సంవత్సరాలుగా ఖరీఫ్ సీజన్ కంటే రబీ సీజన్‌లోనే వేరుశనగను రైతులు ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌లో తుఫానుల వల్ల పంట దెబ్బతింటున్నదని భావించి రబీ సీజన్‌లో సాగు చేస్తున్నారు. గత కొంతకాలంగా రబీ సీజన్‌లో పంట దిగుబడి పెరిగి రైతులకు ఆదాయం వచ్చేది. కానీ రెండు సంవత్సరాలుగా రబీ సీజన్‌లో కూడా దిగుబడి తగ్గి రైతులు నష్టాలు పాలవుతున్నారు. మండలంలో 17 గ్రామ పంచాయతీల్లో 6 వేల ఎకరాలకు పైగా రబీ సీజన్‌లో వేరుశనగను సాగు చేసినట్లు వ్యవసాయాధికారులు పేర్కొన్నారు. ఈ సీజన్‌లో ముఖ్యంగా సాధారణ రకంతో పాటు మరో ఐదు కంపెనీలకు చెందిన కాయలను సాగు చేశారు. ముఖ్యంగా నూలివీడు, చీమలచెరువుపల్లె, గుండ్లచెరువు, గోపనపల్లె, పేరంపల్లె, గోరాన్‌చెరువు, ఎగువగొట్టివీడు, అరవీడు, గాలివీడు, వెలిగల్లు, తూముకుంట, గరుగుపల్లె, పందికుంట, కొర్లకుంట, తలముడిపి, పూలుకుంట తదితర గ్రామాల రైతులు వేరుశనగను ఎక్కువగా సాగు చేశారు.



నూలివీడులో కాయలు లేక దిగుబడి తగ్గిన వేరుశనగ

ఖర్చు ఎక్కువ.. దిగుబడి తక్కువ...

ఒక ఎకరా వేరుశనగ పంటను సాగు చేయడానికి 20 వేల రూపాయలకు పైబడి ఖర్చు అవుతున్నదని రైతులు తెలిపారు. ఇందులో విత్తనకాయలు 42 కేజీల బస్తా 3 వేలకు పైబడి ధర పెట్టి కొనుగోలు చేస్తున్నామని దుక్కులు, ఎరువులు, కూలి వంటి రేట్లు అధికమవుతాయని చెబుతున్నారు. ప్రస్తుతం గింజ మొలక విత్తేనాటి నుంచి చెట్లను తొలగించే వరకు అనేక రకాల తెగుళ్లు సోకుతున్నట్లు పేర్కొన్నారు. గతంలో పంట సాగు కాలం అంతా ఒకటి లేదా రెండుసార్లు మాత్రమే తెగుళ్లకు మందులు పిచికారి చేసేవాళ్లమని కానీ నేడు నెలకు రెండుసార్లు తెగుళ్లకు మందులు పిచికారి చేయాల్సిన పరిస్థితి నెలకొన్నదన్నారు. ఎన్నోసార్లు పిచికారి చేసిన తెగుళ్లు తగ్గలేదని పేర్కొన్నారు. తెగుళ్లు సోకితే పంట దిగుబడి పూర్తిగా తగ్గిపోతున్నదని, తద్వారా రైతులందరూ తీవ్రంగా నష్టపోతున్నామన్నారు. వేరుశనగ విత్తన కాయలను అధిక ధర పెట్టి కొనుగోలు చేయాలని కానీ రైతులు పండించిన పంటలకు ధర ఉండడం లేదన్నారు. వేరుశనగ విత్తనకాయలను 42 కేజీల కాయలు 3500 రూపాయలకు కొనుగోలు చేశామని, తాము పండించిన పంటకు మాత్రం 42 కేజీల ప్యాకెట్ 2500 రూపాయలు ధర పలుకుతున్నదని పలువురు రైతులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఒక ఎకరా 30 బస్తాలు వేరుశనగ కాయలు దిగుబడి వచ్చేవని కానీ నేడు 15 బస్తాలు మాత్రమే దిగుబడి వస్తున్నదన్నారు.

తెగుళ్లలో తీవ్రంగా నష్టపోతున్నాం



నేను 4 ఎకరాల్లో వేరుశనగను సాగు చేశాను. ఒక ఎకరా వేరుశనగను సాగు చేయడానికి 20 వేలకు పైబడి ఖర్చు అయింది. విత్తనాలు మొలక ఎత్తిన 3 వారాలుగా తెగుళ్లు సోకుతున్నాయి. తెగుళ్లకు మందులు పిచికారి చేయడంలో చెట్లు మాత్రం ఏపుగా పెరిగాయి కానీ దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. ఎక్కువగా మచ్చ తెగులు వేరుశనగను నాశనం చేస్తున్నది. గతంలో ఒక ఎకరాకు 30 బస్తాలు దిగుబడి వచ్చేది. ప్రస్తుతం 15 బస్తాలు కూడా రావడం లేదు. దిగుబడి తగ్గిపోవడం వల్ల తీవ్రంగా నష్టపోతున్నాం.

-జగన్నాథ, నూలివీడు

పంట నష్టపరిహారం చెల్లించాలి



రబీ సీజన్‌లో సాగు చేసిన వేరుశనగ పంట తెగుళ్ల వల్ల దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. రైతులు సాగుకు చేసిన ఖర్చులు కూడా వచ్చేటట్లు లేవు. అప్పులు చేసి పంటలను సాగు చేశాము. కానీ దిగుబడి తగ్గిపోవడంతో ఎక్కువగా నష్టపోతున్నాము. పండించిన పంటకు గిట్టుబాటు ధర కూడా లేదు. విత్తనకాయలను ఎక్కువ రేటుకు కొనుగోలు చేసినా మేము పండించిన కాయలు మాత్రం తక్కువ రేటుకు అమ్మాల్సి వస్తోంది. కావున ప్రభుత్వం స్పందించి వేరుశనగను సాగు చేసిన రైతులకు పంట నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలి.

- గల్లా వెంకటయ్య, అలుగుంటివాండ్లపల్లె

ఎన్నికలకు అధికారులు సిద్ధంగా ఉండాలి : జేసీ

కమలాపురం రూరల్, ఫిబ్రవరి 18: త్వరలో జరగబోతున్న సాధారణ ఎన్నికలకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉండాలని జేసీ గణేశ్‌కుమార్ తెలిపారు. ఆదివారం స్థానిక అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ఈవీఎంలను భద్రపరిచే స్ట్రాంగ్ రూములను ఆయన పరిశీలించారు. ప్రతి సంవత్సరం స్థానిక సరస్వతీ జూనియర్ కళాశాలలో వీటిని భద్రపరిచేందుకు అవకాశం లేకుండాపోయింది. అందుకు ప్రత్యామ్నాయంగా గురుకుల పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు నెలల్లో ఈ రాష్ట్రంలో సాధారణ ఎన్నికలు జరగనున్నాయని, ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. ఎన్నికల నిర్వహణకు అధికారులకు షెల్టర్ కూడా ఇక్కడ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎన్నికలు అయిపోయిన తరువాత ఈవీఎంలను కూడా ఇక్కడే భద్రపరుస్తారని అందుకు అనువుగా ఇక్కడ కొన్ని రూములను పరిశీలించామన్నారు. కలెక్టరుకు నివేదిక అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో సీఐ రామక్రిష్ణారెడ్డి, ఎన్నికల డీటీ నరేంద్ర, ఆర్ఐ అర్జున్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



స్ట్రాంగ్ రూములను పరిశీలించేందుకు వెళుతున్న జేసీ గణేశ్‌కుమార్

వైసీపీ పాలనలో అప్పులు ఫుల్.. అభివృద్ధి నిల్

- సంక్షోభంలో సంక్షేమం... ఇది జగన్ పాలన : రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ మీడియా ఛైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి

జమ్మలమడుగు, ఫిబ్రవరి 18: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వైసీపీ పాలనలో అభివృద్ధి లేక ప్రజలు అన్నివిధాలా తీవ్రంగా నష్టపోయారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా ఛైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి అన్నారు. ఆదివారం జమ్మలమడుగులో ఆర్ అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు చేశారు. జగన్ పరిపాలనలో రాష్ట్రానికి అప్పులు ఫుల్, అభివృద్ధి నిల్ అన్నారు. సంక్షోభంలో సంక్షేమం ఇది జగన్‌రెడ్డి పాలన అన్నారు. రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందన్నారు. 1956 నుంచి 2014 వరకు 58 సంవత్సరాలలో నీలం సంజీవరెడ్డి మొదలుకుని కిరణ్‌కుమార్‌రెడ్డి ముఖ్యమంత్రి వరకు 16 మంది ముఖ్యమంత్రుల పాలనా కాలంలో రాష్ట్ర ప్రభుత్వం చేసిన అప్పు లక్ష కోట్ల రూపాయలు అన్నారు. 2014 నుంచి 2019 వరకు అయిదు సంవత్సరాల కాలంలో చంద్రబాబు ప్రభుత్వం చేసిన అప్పు రూ.1.50 లక్షల కోట్లు అన్నారు. కాగా 2019 నుంచి నేటి వరకు నాలుగు సంవత్సరాల 9 నెలల్లో జగన్ ప్రభుత్వం చేసిన అదనపు అప్పు రూ.8.5 లక్షల కోట్లు అన్నారు. జగన్ పాలనలో కోట్ల రూపాయలు అప్పు చేసినా అభివృద్ధి లేదన్నారు. నిధుల కొరతతో సాగునీటి ప్రాజెక్టులు ముందుకు సాగలేదన్నారు. నిర్వహణకు కూడా నిధులు లేకపోవడంతో అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయిందన్నారు. రాష్ట్రంలో రహదారులు మృత్యుకుహరాలయ్యాయన్నారు. జగన్ పాలనలో సంక్షేమం మేడిపండులాగా మారిందని ఇచ్చేది గోరంత, లాక్కునేది కొండంత అన్నారు. అమ్మఒడి, చేయూత, ఆసరా, తదితర పథకాల ద్వారా ప్రభుత్వం ఇస్తున్న సొమ్మును నాన్న బుడ్డి (మద్యం) ద్వారా ప్రభుత్వం లాక్కుంటుందన్నారు. పెట్రోలు, డీజిల్, నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. ఆర్టీసీ చార్జీలు దారుణంగా పెంచారన్నారు. మట్టి ముంత ఇచ్చి వెండి చెంబు దొంగిలించినట్లుగా జగన్ పాలన దారుణంగా మారిందన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి సుబ్రమణ్యశర్మ, మండలాధ్యక్షులు మంచాల పుష్పరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి కైపా జానకీరామకృష్ణ, జమ్మలమడుగు పట్టణ అధ్యక్షుడు రాజేష్, జిల్లా సోషల్ మీడియా అధ్యక్షుడు భూతమాపురం సుబ్బారావు, ఎస్సీ సెల్ నాయకులు సంజయ్, ప్రవీణ్, పాముల బ్రహ్మానంద రెడ్డి, వెంకటేశ్, దేవదాసు, అమర్, ఉత్తన్న, కల్యాణ్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకులపై వైసీపీ మూకల దాడి

- ఇద్దరికి గాయాలు.. ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలింపు
- పోలీసుల పికెట్ ఉన్నా...బరి తెగించిన వైసీపీ నాయకులు
- ఇది పిరికిపంద చర్యగా అభివర్ణించిన భూపేశ్



దాడిలో గాయపడ్డ దండుపల్లెకు చెందిన మహేశ్

ఎర్రగుంట్ల, ఫిబ్రవరి 18: ఎర్రగుంట్ల మండలంలోని దండుపల్లె గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు వరపుత్రుడు, మహేశ్‌లపై చిర్రాజుపల్లెకు చెందిన 12 మంది వైసీపీ నాయకులు ఆదివారం రాత్రి దాడి చేసి తీవ్రంగా గాయపరచారు. టీడీపీ నాయకుల కథనం మేరకు... ఇటీవల దండుపల్లె గ్రామానికి చెందిన వరపుత్రుడునిపై వైసీపీ వారు దాడి చేసి గాయపరచారు. దీంతో గ్రామంలో గత కొద్ది రోజులుగా పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు. పోలీసు పికెట్ ఉన్నా లెక్కచేయకుండా ఆదివారం రాత్రి చిర్రాజుపల్లెకు చెందిన సుమారు 12 మంది వైసీపీ నాయకులు వరపుత్రుడు, మహేష్ ఇళ్లపై దాడికి తెగపడ్డారు. కర్రలతో ఇతర వస్తువులతో మూకుమ్మడిగా దాడి చేయడంతో మహేశ్ తలకు తీవ్ర గాయాలు కాగా, వరపుత్రునికి చేయి విరిగింది. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ శ్రేణులు అక్కడికి చేరుకుని 108లో గాయపడ్డ వారిని ప్రొద్దుటూరుకు తరలిస్తుండగా సీఐ ఈశ్వరయ్య గాయపడ్డ వారికి చిలమకూరులోని ఆసుపత్రిలో చికిత్స చేయిస్తామని అడ్డుకున్నారు. అయినా టీడీపీ శ్రేణులు మాత్రం ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు. అక్కడ వారికి చికిత్స చేస్తున్నారు.

ఆసుపత్రికి చేరుకున్న భూపేశ్‌రెడ్డి

విషయం తెలుసుకున్న టీడీపీ జమ్మలమడుగు ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి తన అనుచరులతో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని వారిని పరామర్శించి భరోసా ఇచ్చారు. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు ప్రొద్దుటూరు ఆసుపత్రికి భారీగా చేరుకున్నారు. టీడీపీ కార్యకర్తలపై దాడి చేయడం పిరికిపంద చర్య అని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి అన్నారు. ఆసుపత్రిలో ఆయన మాట్లాడుతూ దండుపల్లెలో పోలీసులుండగానే ఇలాంటి సంఘటన జరగడం దేనికి సంకేతమో పోలీసులు చెప్పాల్సిన అవసరముందన్నారు. ఇలాంటి కవ్వింపు చర్యలకు తాము భయపడమన్నారు. అతి త్వరలో ప్రజా క్షేత్రంలో ప్రజలు ఎమ్మెల్యేకి బుద్ధిచెబుతారన్నారు. ధైర్యముంటే వచ్చే ఎన్నికల్లో ఎవరి సత్తా ఏంటో తేల్చుకుందామని పేర్కొన్నారు. ఇలాంటి చర్యలు మళ్లీ జరిగితే తగిన రీతిలో తాము కూడా బుద్ధి చెప్పాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ విషయాన్ని పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి, టీడీపీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఇకపై టీడీపీ కార్యకర్తల జోలికొస్తే ఊరుకునే ప్రశ్నేలేదని ఈ సంఘటనపై ఘాటుగా స్పందించారు. తన కార్యకర్తలకు ఎప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

ఈ విషయంపై వివరణ కోరేందుకు ఎర్రగుంట్ల అర్బన్ సీఐ ఈశ్వరయ్య, డీఎస్పీ యశ్వంత్‌లకు ఫోన్ చేయగా వారు లిఫ్ట్ చేయకపోవడం గమనార్హం. ఈ సంఘటనతో దండుపల్లె, చిర్రాజుపల్లెలో మరింత భద్రత పెంచినట్లు తెలిసింది.



బాధితులతో జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి

కరెంటు కోతలతో పంట ఎండుతోంది

● ఆందోళనలో వేరుశనగ రైతులు



చేతికొచ్చిన వేరుశనగ ఎండిపోతున్న దృశ్యం

చిన్నమండెం, ఫిబ్రవరి 18: ప్రభుత్వం రైతులకు 9 గంటల ఉచిత విద్యుత్‌ను అందిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్నప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు మాత్రం పూర్తి భిన్నంగా ఉన్నాయి. మండల వ్యాప్తంగా ఐదు సబ్‌స్టేషన్లలో వ్యవసాయ కరెంటును గత 10 రోజులుగా 7 గంటల మాత్రమే ఇస్తుండడంతో పంటలు ఎండుతున్నాయని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా వేరుశనగ రైతులు, టమోటా, మామిడి రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేరుశనగ కోత దశలో ఉన్నందున సరైన సమయంలో నీరు అందించలేకపోతే పంట పూర్తి స్థాయిలో దెబ్బతింటుందని, అసలే ఎండల తీవ్రత ఎక్కువ ఉన్నందున నీటి తడులు అందించాల్సి ఉందన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో కరెంటు సరఫరా 7 గంటలే ఇస్తే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. ఫిబ్రవరిలోనే కరెంటు కోతలు ఇలా ఉంటే ఇక ఏప్రిల్, మే, జూన్ నెలల్లో ఎలా అని రైతులు వాపోతున్నారు. దీనిపై డీఈ చంద్రశేఖర్ రెడ్డిని వివరణ కోరగా... తాత్కాలికంగా కొన్ని సాంకేతిక ఇబ్బందుల కారణంగా పై నుంచి 7 గంటలు మాత్రమే వ్యవసాయ కరెంటు ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చారని, విద్యుత్ జనరేషన్ ఇంప్రూవ్‌మెంట్ అయిన వెంటనే పూర్తి స్థాయిలో రైతులకు 9 గంటల కరెంటు అందిస్తామన్నారు.


సాంస్కృతిక కళలకు రూ.30 వేలు విరాళం



గ్రామ పెద్దలకు చెక్కును అందజేస్తున్న దృశ్యం

ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 18: అంతరించి పోతున్న సంప్రదాయ కళలు భవిష్యత్తు తరాలకు అందాలనే ఉద్దేశంతో బొమ్మవరం గ్రామంలో కోలాటం, గజ్జ పూజ కార్యక్రమం కొరకు ముక్కా రూపానంద రెడ్డి ఫౌండేషన్ తరపున రూ.30 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ముక్కా రూపానందరెడ్డి సతీమణి వరలక్షుమ్మ చెక్కును గ్రామ పెద్దలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మనెమ్మ, ఉమ్మల రోజు సుబ్బరాజు, రఘునాధరెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, రాజారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మలకూ ఓట్లు




● మైనర్లకు నమోదవుతున్న ఓటుహక్కు

● తవ్వేకొద్దీ తప్పులు

● తప్పుల తడకగా తుది జాబితా

సుండుపల్లె/చిట్వేలి, ఫిబ్రవరి 18: ప్రభుత్వం విడుదల చేసిన తుది జాబితాలో తవ్వేకొద్దీ తప్పులు కనిపిస్తూనే ఉన్నాయి. ఒకవైపు అధికారులు తప్పులు లేకుండా తుది జాబితా విడుదల చేశామని చెబుతున్నా వెతికే కొద్దీ తప్పులు బయటపడుతున్నాయి. జాబితాలో దొంగ ఓట్లు, డబుల్ ఎంట్రీలతో పాటు



డబుల్ ఓట్లు, ఇతర సమస్యలతో తీసివేసిన ఓటర్లు


పెద్ద సంఖ్యలో ఆత్మలకు (చనిపోయిన వారికి) చోటు కల్పించినట్లు విమర్శలు వస్తున్నాయి. కొన్నిచోట్ల మైనర్లకు కూడా ఓటుహక్కు కల్పించారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

సుండుపల్లె మండల వ్యాప్తంగా 52 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఓటు హక్కును వినియోగించుకునే వారిలో మహిళలు 22,172 కాగా, పురుషులు 21,269 మంది ఓటర్లు ఉన్నారు. మొత్తం 42,442 మంది ఓటర్లు ఉన్నారు. అయితే ఈసారి ఓటర్లకు ఓటు వేయాలంటే అష్టకష్టాలు తప్పేలా లేవని కొంతమంది ఓటర్లు చెబుతున్నారు. అయితే ప్రస్తుతం ఒక బూత్ పరిధిలో ఉండే ఓటర్లను మరో బూత్ పరిధిలోకి పెద్ద సంఖ్యలో మార్పు జరిగినట్లు స్థానిక ఓటర్లు చెబుతున్నారు. క్రమసంఖ్యతో పాటు బూత్‌లను సైతం మార్చినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ప్రభుత్వం విడుదల చేసిన ఓటరు జాబితా రాజకీయ పార్టీల నాయకులతో పాటు ఓటర్లను సైతం తికమక పెట్టేలా ఉందని విమర్శలు వస్తున్నాయి. కాగా చనిపోయిన 16 ఓటర్లను ఆదివారం ఉదయం ఆగమేఘాల మీద తొలగించినట్లు తెలిసింది.

ఇక చిట్వేలి మండలంలో ఓటరు జాబితాలో తప్పులను సవరించాల్సిన అధికారులు ఏమీ పట్టనట్లు ఉంటున్నారని విమర్శలు వినబడుతున్నాయి. ప్రతిపక్ష నాయకులు రెండు మూడు నెలలు గ్రామాల్లో తిరుగుతూ చనిపోయిన వారు గ్రామాల నుంచి వెళ్లిపోయిన వారు, మైనర్ ఓట్లు నమోదులపై గ్రామాలకు సంబంధించిన వారి వివరాలు సేకరించి మండల యంత్రాంగానికి ఆధారాలు ఇచ్చినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. ప్రజాక్షేత్రంలో పారదర్శకంగా ఉండాల్సిన అధికారులు తొలగించాల్సిన ఓటర్లను ఇంత వరకు ఎందుకు తొలగించడం లేదని ఆరోపణ వినబడుతున్నాయి.

రెండు చోట్ల ఓటరు జాబితాలో పేర్లు

రెండు చోట్ల ఓటరు జాబితాలో ఒకే వ్యక్తి పేరు చేర్చారు. మండల పరిధిలోని కె.ఎస్.అగ్రహారంలో ఓటరు జాబితాలో పేరు ఉండగా రాజంపేట లేబాక గ్రామంలోని ఓటరు జాబితాలో పేరు చేర్చారు. ఇలా రెండు చోట్ల ఒకే వ్యక్తి ఓటరు జాబితాలో పేరు చేర్చారు.



సుండుపల్లె ఓటర్ లిస్టులో చనిపోయిన రెడ్డిబాషా ఓటు

నాకు ఓటు హక్కు కల్పించండి

- నీలావతి, నల్లప్పగారిపల్లె, సుండుపల్లె



నాకు ఓటు హక్కు కల్పించండి. రానున్న ఎన్నికల్లో ఓటు వేస్తాను. జీవనోపాధి కోసం నేను కువైత్ వెళ్లాను. దీంతో గత ఎన్నికల్లో నా ఓటు హక్కును వినియోగించుకోలేక పోయాను. ఎందుకు నా ఓటును తొలగించారో మాకు తెలియదు. మా కుటుంబంలో ఎవరిని సంప్రదించకుండానే నా ఓటు తొలగించినట్లు ఉంది. నాకు కొత్త ఓటరు కార్డు కూడా మంజూరు కాలేదు.

సామాన్యులకు అర్థమయ్యేలా లేదు

- ఎల్వీ రమణ, ఐటీడీపీ నాయకుడు, సుండుపల్లె



ఓటరు తుది జాబితా సామాన్య ఓటరుకు అర్థమయ్యేలా లేదు. మా గ్రామ పంచాయతీ పరిధిలో ఇతర నియోజకవర్గాలకు చెందిన కొత్త ఓట్లు ఉన్నాయి. కొన్ని ఓట్లు బూత్‌లు మారిపోయాయి. ప్రతి ఓటరు క్షుణ్ణంగా పరిశీలించి ఏ బూత్‌లో ఓటు ఉందో అక్కడికి వెళ్లి ఓటు వేస్తే గానీ ఓటు వేయలేని పరిస్థితి ఏర్పడేలా ఉంది. చదువుకోని వారికి ఎక్కడ ఏ బూత్‌లోకి వెళ్లి ఓటు వేయాలో చెబితే గానీ అర్థం కాని పరిస్థితి ఉంది.

చనిపోయినా తొలగించలేదు

మండల పరిధిలోని తిమ్మాయపాలెం పంచాయతీ అదే గ్రామంలో చనిపోయిన వారికి ఓట్ల జాబితాలో చోటు కల్పించారు. ఒక పంచాయతీలోని కాకుండా మండల పరిధిలోని చాలా పంచాయతీల్లో ఇదే సమస్య కొనసాగుతుందని పలువురు ఆరోపిస్తున్నారు.



చిట్వేలిలో ఓటరు జాబితాలో చేర్చిన అండర్ ఏజ్ జాబితా

అనర్హత ఓట్లను తొలగించండి

అధికారులు అనర్హత ఓట్లను తొలగించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి, మండల పరిధిలోని అన్ని పంచాయతీలలో ఓటరు జాబితాల తప్పులు దొర్లుతున్నాయి. రెండు నెలలుగా గ్రామాల్లో తిరుగుతూ చనిపోయిన వారు, గ్రామం నుంచి వెళ్లిపోయిన గ్రామాలకు సంబంధించిన వారి వివరాలు సేకరించి స్థానిక రెవెన్యూ బీఎల్‌వోలకు సమాచారం అందించినప్పటికీ అధికారులు పట్టనట్లు ఉంటున్నారు. ప్రజాక్షేత్రంలో పారదర్శంగా ఉండాల్సిన అధికారులు తొలగించాల్సిన ఓట్లను ఇంతవరకు తొలగించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటికైనా స్పందించి అనర్హులైన ఓట్లు తొలగించాలని కోరారు.



నాగవరంలో ఓట్ల జాబితాను పరిశీలిస్తున్న టీడీపీ నేత రాజశేఖర్ నాయుడు

సమ్మె విజయవంతం అభినందనీయం

● సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్

ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 18: జిల్లాలో సార్వత్రిక గ్రామీణ బంద్‌ను జయప్రదం చేసిన కార్మిక వర్గానికి సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్ అభినందనలు తెలిపారు. అదే విధంగా జిల్లాలో పారిశ్రామిక ప్రాంతమైన ఏపీఎండీసీలో పోరాట కమిటీ జేఏసీ, సీఐటీయూ అనుబంధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పారిశ్రామిక సమ్మెను, విజయవంతం చేసిన కార్మిక వర్గానికి సహకరించిన ప్రైవేట్‌లారీ ఓనర్స్ డ్రైవర్స్ ట్రాన్స్‌పోర్ట్ రంగానికి, ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పట్టు వస్త్రాలు, తాళిబొట్టు సమర్పణ

సిద్దవటం, ఫిబ్రవరి 18: మండలంలోని జంగాలపల్లి గ్రామ పంచాయతీ కమ్మపాలెం ఎస్సీ కాలనీ నివాసమున్న తిరుమలయ్య మునేశ్వరమ్మ కుటుంబం వివాహ మహోత్సవ సందర్భంగా కృష్ణ, తిరుపతమ్మల కల్యాణానికి టీడీపీ రాజంపేట ప్రధాన కార్యదర్శి నాగమునిరెడ్డి దంపతులు తాళిబొట్టు, పట్టువస్త్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదల కుటుంబాల కల్యాణానికి పార్టీ తరపున ఉచితంగా ఈ కార్యక్రమం చేశామన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

గాలివీడు, ఫిబ్రవరి 18: మండల కేంద్రంలోని శ్రీవెంకటేశ్వర హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ఉచిత మెగా షుగర్ వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు ఈ వైద్య శిబిరానికి వచ్చి ఉచితంగా పరీక్షలు, మందులు పంపిణీ చేసినట్లు వైద్య నిపుణుడు డాక్టర్ మిట్టపల్లి పుల్లారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ విజయ్, వెంకటేశ్, ప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ హయాంలోనే బీసీలకు పెద్ద పీట

రాజంపేట, ఫిబ్రవరి 18: తెలుగుదేశం అధికారంలో ఉన్నప్పుడే రాష్ట్రంలోని బీసీలకు అన్ని రంగాల్లో ప్రాముఖ్యత ఇచ్చారని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, బీసీ నాయకుడు డాక్టర్ చెన్నూరు సుధాకర్, రాజంపేట పార్లమెంటు బీసీ అధ్యక్షుడు సురేంద్రబాబు, అసెంబ్లీ అధ్యక్షులు వెంకటరమణ, బీసీ సాధికార కమిటీ రాష్ట్ర కన్వీనర్ శివప్రసాద్ నాయుడులు పేర్కొన్నారు. ఆదివారం రాజంపేట పట్టణంలోని కళ్యాణ మండపంలో టీడీపీ ఆధ్వర్యంలో జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల కోసం, బీసీల కోసం జ్యోతిరావుఫూలే చేసిన పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీఆర్, జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు గత 40 ఏళ్లుగా బీసీలకు అటు రాజ్యాంగ పదవుల్లోనూ, ఇటు పార్టీ పదవుల్లోనూ వారిని ఆర్థికంగా ఆదుకోవడంలోనూ అన్ని రకాలుగా మంచి చేయడం జరిగిందన్నారు. వైసీపీ అధినేత జగన్ ముఖ్యమంత్రి అయిన తరువాత బీసీలను అన్ని రకాలుగా అణిచివేతకు గురిచేశారన్నారు. జగన్ ప్రభుత్వంలో 75 మందికి పైగా బీసీ నాయకులు హత్యకు గురయ్యారని, 2540 మంది బీసీలు దాడులకు గురయ్యారని, 26 వేల మంది బీసీలపై అక్రమ కేసులు బనాయించారని ఆరోపించారు. ఈ సందర్భంగా నందమూరి తారకరత్న మొదటి వర్ధంతి సందర్భంగా ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని 5 నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు నాగరాజుయాదవ్, తాటి సుబ్బరాయుడు, అధికార ప్రతినిధి త్యాగరాజు, బీసీ సెల్ మాజీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఇడిమడకల కుమార్, మాజీ కౌన్సిలర్ చిన్నయ్య, పార్లమెంటు అధికార ప్రతినిధి ప్రతాప్‌రాజు, రాజంపేట పట్టణ అధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు, లీగల్ సెల్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, పార్లమెంటు మహిళాధ్యక్షురాలు అనసూయాదేవి, కార్యనిర్వహక కార్యదర్శి భోగా సుజాత, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలి

● ఆపస్ రాష్ట్ర కార్యదర్శి మధుమతి డిమాండ్

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 18: ప్రభుత్వం నూతన పీఆర్‌సీపై 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని ఏపీ ఉపాధ్యాయ సంఘం (అపస్) రాష్ట్ర కార్యదర్శి టి.మధుమతి, జిల్లా గౌరవాధ్యక్షుడు కే.పరశురాంలు డిమాండ్ చేశారు. ఆదివారం రాయచోటి పట్టణంలోని అపస్ కార్యాలయంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు నరసింహులు అధ్యక్షతన రాయచోటి మండల కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. అనంతరం రాయచోటి మండల నూతనశాఖ అధ్యక్షుడిగా మల్లికార్జున, ప్రధాన కార్యదర్శిగా గడికోట బాలాజీ, గౌరవాధ్యక్షుడు రమేశ్‌కుమార్, కోశాధికారిగా రాంప్రసాద్, ఉపాధ్యక్షులుగా రామకృష్ణ, అంబికేశ్వరి, కార్యదర్శిగా ఓబుల్‌రెడ్డి, రాజలక్ష్మిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో అపస్ జిల్లా సహాధ్యక్షుడు రామాంజనేయరెడ్డి, జిల్లా మహిళా కన్వీనర్ శైలజ, జిల్లా ఉపాధ్యక్షుడు నరేంద్ర, జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, ఉపాధ్యాయులు సురేశ్‌కుమార్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

25 నుంచి ధ్యాన సప్తాహ మహాసభలు

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 18: జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని షిరిడీసాయిబాబా మందిరంలో ఈ నెల 25 నుంచి వారం రోజుల పాటు జరిగే ధ్యాన సప్తాహ మహాసభలను పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రాచవీడు పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు సతీశ్‌కుమార్, జంగమయ్య, కోఆర్డినేటర్ డాక్టర్ బయారెడ్డిలు పిలుపునిచ్చారు. ఆదివారం వారు మీడియాతో మాట్లాడుతూ గత 25 ఏళ్లుగా సొసైటీ ఆధ్వర్యంలో ఎన్నో దఫాలుగా ధ్యాన కార్యక్రమాలు జరుగుతూ వస్తున్నాయన్నారు. ఈ క్రమంలోనే ప్రతి పౌర్ణమికి ధ్యాన కార్యక్రమం చేపట్టడం ద్వారా ఎంతో మంది శాంతి మార్గంలో పయనిస్తున్నారని చెప్పారు. అనంతరం మహాసభలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు.

18 మందికి కంటి ఆపరేషన్లు

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 18: జిల్లా కేంద్రమైన రాయచోటి మండల పరిధిలోని చెన్నముక్కపల్లె గ్రామంలో గల లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం జరిగిన కంటి వైద్య శిబిరంలో 18 మందికి కంటి ఆపరేషన్లు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పరిధిలోని రాయచోటి నియోజకవర్గంతో పాటు రాజంపేట, రైల్వేకోడూరు, వీరేరు, యర్రావారిపాలెం, కేవీపల్లి, కలకడ, కలికిరి, గుర్రంకొండ, పెద్దమండెం, కదిరి, ఎన్‌పీకుంట, చక్రాయపేట తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో హాజరయ్యారు. అందులో 18 మందికి ఆపరేషన్లు చేయగా, గతంలో ఆపరేషన్ చేయించుకున్న 30 మందికి ఉచితంగా అద్దాలు, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కంటి ఆసుపత్రి చైర్మన్ వైవీఆర్ స్వరూపగుప్త, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అన్వర్‌బాషా, లయన్ జయరామిరెడ్డి, వెంకట్రామిరెడ్డి, కంటి వైద్యులు పాల్గొన్నారు.

గంగమ్మ తల్లికి ఘనంగా పూజలు



ప్రత్యేక అలంకారంతో అమ్మవారు

లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 18: మండలంలోని అనంతపురం గ్రామంలో వెలసిన గంగమ్మ తల్లికి ఆదివారం ఘనంగా పూజలు నిర్వహించారు. జాతర సమీపిస్తుండంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనా లు సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. జాతర 15 రోజులే ఉండడంతో భక్తులు దూర ప్రాంతాల నుంచి వచ్చి అమ్మవారికి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయ ఈఓ రవీంద్రరాజు జాతరలో అన్ని ఏర్పాట్లు చేశారు.

'రాజధాని ఫైల్స్' ఉచిత సినిమాల ప్రదర్శన



సినిమా తిలకిస్తున్న జగన్‌మోహన్‌రాజు, నేతలు

రాజంపేట, ఫిబ్రవరి 18: రాజంపేట పట్టణంలో రాజధాని ఫైల్స్ ఉచిత సినిమాలను టీడీపీ పార్లమెంటు అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు ఆధ్వర్యంలో ప్రదర్శించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి రాజంపేట పట్టణంలోని సినిమా హాలులో ఈ సినిమా ప్రదర్శన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సమాజాన్ని చైతన్య పరిచే ఈ సినిమాను ప్రతిఒక్కరూ చూడాల్సిన అవసరం ఉందన్నారు. రాజధాని అమరావతిలో జగన్ పైశాచికత్వం వల్ల రైతులు పడుతున్న బాధలు ఇందులో తెలుసుకోవచ్చన్నారు. ఈ సినిమాను ప్రజలు చూస్తే ఎక్కడ జగన్‌ను ఛీ కొడతారోనని, కోర్టు ద్వారా సినిమాను ఆపే ప్రయత్నం చేశారని, అయితే కోర్టు కూడా సినిమా ప్రదర్శనకు అనుమతి ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పార్లమెంటు కార్యనిర్వహక కార్యదర్శి కోవూరు సుబ్రమణ్యంనాయుడు, టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పోలి శివకుమార్, మండల పార్టీ ఉపాధ్యక్షులు సతీష్‌రాజు, సుబ్బరాజు, హరినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు(రూరల్): రాజధాని ఫైల్స్ సినిమా అమరావతి రైతుల కన్నీటి గాథ అని రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జ్ కస్తూరి విశ్వనాథనాయుడు అన్నారు. ఆదివారం పట్టణంలోని లవ థియేటర్‌లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి కొరకు 35 వేల రైతుల త్యాగాల వాస్తవ రూపమే రాజధాని ఫైల్స్ సినిమా అని కొనియాడారు. సినిమాలో ఎవరిని ఎటువంటి కించపరిచే సన్నివేశాలు లేవని, ప్రతి రైతు చూడాల్సిన సినిమా అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామిక వేత్త మాచినేని విశ్వేశ్వరనాయుడు, ఓబులవారిపల్లి మండల అధ్యక్షుడు వెంకటేశ్వరరాజు, సీనియర్ నాయకులు గడికోట సుబ్బరాయుడు, మహిళ నాయకురాలు నగిరిపాటి రేవతి, అనిత దీప్తి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆంజనేయస్వామి రథోత్సవం



రథాన్ని లాగుతున్న భక్తులు

నందలూరు, ఫిబ్రవరి 18: నందలూరులోని నూకినేనిపల్లె పంచాయతీ కుంపినీపురంలో వెలసిన వరాహ ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. రథాన్ని పూలతో సుందరంగా అలంకరించి స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని కొలువుదీర్చారు. రాష్ట్ర నలుమూలల నుంచే కాక, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర రాష్ట్రాల్లో ఉన్న వంశస్తులు రథాన్ని ఊరేగింపు నిర్వహించారు. కుంపినీపురం, మిద్దెల, బలిజేపల్లి గ్రామాల మీదుగా బాణాసంచా పేలుస్తూ, డప్పు వాయిద్యాల మధ్య రంగులు చల్లుకుంటూ అత్యంత అట్టహాసంగా ఊరేగింపు కొనసాగింది. ఈ సందర్భంగా జనసేన పార్టీ నియోజకవర్గ నాయకుడు అతికారి దినేష్ స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలను నిర్వహించారు. భక్తుల సౌకర్యార్థం స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

కార్మికుల సమస్యలపై పోరాటాలకు సిద్ధం

● ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 18: కార్మికుల సమస్యలపై పోరాటాలకు ఏఐటీయూసీ సిద్ధంగా ఉంటుందని జిల్లా అధ్యక్షుడు తుమ్మల రాధాకృష్ణ, జిల్లా కార్యదర్శి గంగాధర్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన కార్యవర్గంలో 20 మంది కౌన్సిల్ సభ్యులు ఉంటారని, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త కార్మికుల వ్యతిరేక చట్టాలపై తమ పోరాటం ఆగదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ ఏపీఎండీసీ ప్రధాన కార్యదర్శి మురళి, త్రివేణి కార్మిక సంఘం కార్యదర్శి వెంకటరమణ, ఆటో యూనియన్ నాయకులు దేసయ్య, హరి, సుబ్బరాయుడు, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వెంకటరమణకు కవి శిఖామణి బిరుదు



బిరుదును అందుకున్న వెంకటరమణ

రాజంపేట, ఫిబ్రవరి 18: కవి శిఖామణి బిరుదును రాజంపేటకు చెందిన తెలుగు పండితులు, కవి గంగనపల్లి వెంకటరమణ అందుకున్నారు. హైదరాబాదు నగరంలోని రవీంద్రభారతిలో ఆదివారం ఈ సదస్సు జరిగింది. కరీంనగర్‌కు చెందిన మహతీ సాహితీ కవి సంఘమం వారి ఆధ్వర్యంలో గత నాలుగు రోజులుగా రోజుకు 100 కవితలు రచించిన కవులకు ఈ బిరుదును అందజేశారు. ఇందులో గంగనపల్లి వెంకరటమణ పాల్గొని ఈ అవార్డును అందుకున్నారు. కార్యక్రమంలో మహతీ సాహితీ కవి సంఘమం అధ్యక్షుడు డాక్టర్ సదయ్య, తెలంగాణ రాష్ట్ర సాహిత్య అకాడమీ అధ్యక్షుడు నందిని సిద్దారెడ్డి, కార్యదర్శి నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు. నందలూరు మండలం నాగిరెడ్డిపల్లెలో పనిచేస్తున్న గంగనపల్లి వెంకటరమణ తెలుగు భాష సంరక్షణ సమితి జిల్లా సహాయ కార్యదర్శిగా పనిచేస్తూ అనేక తెలుగు సంరక్షణ సమితి కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

గాలివీడు, ఫిబ్రవరి 18: మండల కేంద్రంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 1986-87లో పదవ తరగతి చదివిన వారంతా కలుసుకుని పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రస్తుత ప్రధానోపాధ్యాయుడు మోహిద్దీన్ ప్రసంగిస్తూ ఎప్పుడో చదివిన పాఠశాలను గుర్తించుకుని ఆనాడు చదువు చెప్పిన ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమంలో సత్కరించుకోవడం గొప్ప సాంప్రదాయమని కొనియాడారు. అనంతరం ఆ నాటి గురువులు మల్లన్న, నరసింహారెడ్డి, భాస్కర్‌రెడ్డిలను దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమాన్ని ముందుండి నడిపించిన ఉపాధ్యాయుడు గౌస్‌మోహిద్దీన్‌ను పలువురు అభినందించారు. కార్యక్రమం ముగిసిన అనంతరం వచ్చిన అతిథులకు విందును ఏర్పాటు చేశారు.

వైభవంగా సీతారాముల కల్యాణం

నందలూరు, ఫిబ్రవరి 18: మండలంలోని ఆడపూరు దిగువ హరిజనవాడలో జడ్పీటీసీ గడికోట ఉషారాణి, వెంకటసుబ్బారెడ్డి (జేసీబీ సుబ్బారెడ్డి) దంపతుల ఆధ్వర్యంలో ఆదివారం సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ మహోత్సవంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ ఆలయ నిర్మాణానికి దాదాపు రూ.10 లక్షలు జేసీబీ సుబ్బారెడ్డి దంపతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నందలూరు చైతన్య భారతిరెడ్డి, నందలూరు భాస్కర్ రెడ్డి, నరసారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, రామచంద్రారెడ్డి, యానాదిరెడ్డి, రమణ, నరసింహులు, రమణయ్య, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

బలవంతంగా విద్యాసంస్థల బస్సుల తరలింపు

● టీఎన్ఎస్ఎఫ్ నేతల విమర్శ

చిత్తూరు (సెంట్రల్), ఫిబ్రవరి 18: అనంతపురం జిల్లా రాప్తాడులో జరిగిన వైఎస్సార్‌సీపీ సిద్ధం సభకు రూట్ పర్మిట్ లేకుండా ప్రభుత్వ, ప్రైవేటు, విద్యాసంస్థల బస్సులు తరలించడం సరికాదని టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ప్రభుతేజ ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల బస్సులు సిద్ధం సభకు తరలించడంతో శనివారం పాఠశాలలకు సెలవులు ప్రకటించారని పేర్కొన్నారు. ఆర్టీసీ బస్సులు లేక పోవడంతో శని, ఆదివారాల్లో ప్రయాణికులు బస్టాండ్‌లో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చిందన్నారు. ట్రాన్స్‌పోర్టు అధికారుల నిబంధనల మేరకు ప్రైవేటు పాఠశాలల బస్సులు రోజుకు కేవలం 60 నుంచి 80 కిలో మీటర్లు మాత్రం నడపాల్సిఉందని, అలాంటి ఎలాంటి పర్మిట్, ఫిట్‌నెస్ లేకుండా ఏకంగా 600 కిలో మీటర్లు పాఠశాల బస్సులు నడపడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక, తప్పులు చేసిన ప్రతి అధికారికి శిక్ష తప్పదని హెచ్చరించారు.

సద్దికూళ్లపల్లెలో జల్లికట్టు



వెదురుకుప్పం, ఫిబ్రవరి 18: వెదురుకుప్పం మండలం కొమరగుంట పంచాయతీ సద్దికూళ్లపల్లెలో ఆదివారం జల్లికట్టు నిర్వహించారు. కోడెగిత్తల కొమ్ములకు వివిధ రకాల పట్టీలను కట్టి అల్లివైపు వదిలారు. ఈ పట్టీలను సొంతం చేసుకునేందుకు అల్లిలో సిద్ధంగా ఉన్న యువకులు గిత్తలను ఆపే ప్రయత్నం చేశారు. ఆ ప్రయత్నంలో పలువురు గాయపడ్డారు. పట్టీలు దక్కించుకున్న యువకులు కేరింతలు కొట్టారు. జల్లికట్టు నిర్వహణ సందర్భంగా జనం ఈలలు, కేకలు దద్దరిల్లాయి. జల్లికట్టుకు వచ్చిన జనంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

తిరుపతిలో నేటి నుంచి రెండో విడత శిక్షణ

● జేసీ సహా హాజరుకానున్న 23 మంది అధికారులు

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 18: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నిర్వహణపై తిరుపతిలో సోమవారం నుంచి 23వ తేదీవరకు ఎంపికచేసిన అధికారులకు రెండో విడత శిక్షణ జరగనుంది. ఇందుకోసం తిరుపతిలోని పద్మావతి యూనివర్సిటీ క్యాంపస్‌లోని తిరుపతి అడ్మిన్ బిల్డింగ్, హ్యూమానిటీస్ సెమినార్ హాల్, సావేరి అతిథిగృహ సెమినార్ హాలును కేంద్రాలుగా ఎంపిక చేశారు. నామినేషన్ల స్వీకరణ, నేరచరిత్రలుంటే వారి వివరాల సేకరణ, నామినేషన్ల భద్రత, పోలింగ్ ఏర్పాట్లు, బ్యాలెట్ పేపర్లు, డిస్ట్రిక్ ఎలక్షన్ మేనేజ్‌మెంట్ ప్లాన్, ఇంటర్నెట్ అప్లికేషన్, వివిధ పోర్టల్స్ వినియోగం, నామినేషన్ల స్వీకరణ సమయంలో అర్హులు, అనర్హుల గుర్తింపు, ఈవీఎం, వీవీప్యాట్, మోడల్ కోడ్, ఎక్స్‌పెండీచర్, ఓట్ల లెక్కింపు- ఫలితాల వెల్లడిపై శిక్షణ ఇస్తారు. ఈ శిక్షణకు జేసీ శ్రీనివాసులుతో పాటు, పలమనేరు, కుప్పం, నగరి ఆర్డీవోలు, చిత్తూరు, పుంగనూరు, నగరి మున్సిపల్ కమిషనర్లు, పుంగనూరు, రొంపిచెర్ల, పులిచెర్ల, చౌడేపల్లి, నగరి, విజయపురం, నిండ్ర, పెనుమూరు, కార్వేటినగరం, గంగాధర నెల్లూరు, పాలసముద్రం, శ్రీరంగరాజపురం, గుడిపాల, ఐరాల, పూతలపట్టు, తవణంపల్లె తహసీల్దార్లు హాజరౌతారు.

50శాతం ఇళ్ల రిజిస్ట్రేషన్లు పూర్తి

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 18: జగనన్న కాలనీల్లో ఇళ్ల రిజిస్ట్రేషన్లు ఆదివారం నాటికి 50శాతం పూర్తయ్యింది. ఆదివారం సెలవు రోజైనా రిజిస్ట్రేషన్లు జరిగాయి. జిల్లావ్యాప్తంగా జగనన్న కాలనీల్లోని 34,924 ఇండ్ల రిజిస్ట్రేషన్లు జరగాల్సివుండగా, ఆదివారం నాటికి 16,297 రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయి. ఇంకా 18,627 ఇళ్ల రిజిస్ట్రేషన్లు జరగాల్సివున్నాయి.

నా పరువుకు భంగం కల్గిస్తున్నారు

ముడా ఛైర్మన్‌పై న్యాయవాది నవీన్ బార్ అసోసియేషన్‌కు ఫిర్యాదు

పుంగనూరు, ఫిబ్రవరి 18: తన పరువు ప్రతిష్టలకు భంగం కలిగిస్తూ తన ఫొటోకు శ్రద్ధాంజలి, దారిదోపిడీలు చేసే దొంగ అంటూ ముడా ఛైర్మన్, న్యాయవాది ఎస్.వెంకటరెడ్డి యాదవ్ సోషియల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారని బార్ అసోసి యేషన్‌కు ఫిర్యాదు చేసినట్లు న్యాయవాది ఎల్.నవీన్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ పుంగనూరుకు చెందిన వెంకటరెడ్డియాదవ్ తనపై తప్పుడు కేసులు పెట్టి ఇబ్బంది పెట్టడంతోపాటు తన పరువ దెబ్బతీసే విధంగా ఫేస్‌బుక్, వాట్సాప్‌లో అసభ్య పదజాలాలు వాడుతూ పోస్టులు పెట్టడం దారుణమన్నారు. మూడేళ్లుగా కోర్టులో న్యాయవాదిగా పనిచేస్తుండగా తనపై కక్షపూరితంగా, భవిష్యత్ నాశనం చేసేవిధంగా ఆయన వ్యవహరిస్తూ వ్యక్తిత్వాన్ని కించపరుస్తున్నారని ఆరోపించారు. తాను పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, వెంకటరెడ్డియాదవ్ తనపై ఫిర్యాదు చేసిన వెంటనే పోలీసులు కేసులు నమోదు చేసినట్లు వాపోయారు. బార్‌అసోసియేషన్ విచారించి తనకు న్యాయం చేయాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో కారు డ్రైవర్ మృతి

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 18 : పుంగనూరు-మదనపల్లె మార్గంలోని సుగాలిమిట్ట క్రాస్ వద్ద కారు బోల్తాపడి శనివారం రాత్రి డ్రైవర్ ధ్రువరాజ్ మృతి చెందినట్లు హెడ్‌కానిస్టేబుల్ మహేంద్ర తెలిపారు. ఆయన కథనం మేరకు ... బెంగళూరు సమీపంలోని మహదేవపూర్‌కు చెందిన మునియప్ప కుమారుడు ధ్రువరాజ్(44) అతని స్నేహితులతో కలసి బోయకొండ గంగమ్మ దర్శనార్థం శనివారం రాత్రి కారులో బయలుదేరారు. దారి తప్పి మదనపల్లె వైపు వెళ్లగా సుగాలిమిట్ట క్రాస్ వద్ద కారు అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో డ్రైవింగ్ చేస్తున్న ధ్రువరాజ్ అక్కడక్కడే మృతి చెందగా మరో ఇద్దరు గాయపడ్డారు. వీరు చికిత్స నిమిత్తం బెంగళూరులకు వెళ్లినట్లు తెలిపారు.

నేడు కలెక్టరేట్‌లో స్పందన

చిత్తూరు, ఫిబ్రవరి 18: కలెక్టరేట్‌లో సోమవారం స్పందన కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ షన్మోహన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజల నుంచి కలెక్టర్, ఇతర అధికారులు వినతిపత్రాలను స్వీకరిస్తారని తెలియజేశారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

● ఎస్పీ కార్యాలయంలో..

జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం జరుగుతుందని ఎస్పీ జాషువా తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరిస్తామని పేర్కొన్నారు.

సీకే బాబుకు కాంగ్రెస్‌లోకి ఆహ్వానం



సీకే బాబు నివాసంలో ఆయనతో చర్చిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 18: చిత్తూరు మాజీ ఎమ్మెల్యే సీకే బాబును కాంగ్రెస్ పార్టీలోకి రావాలని ఆ పార్టీ నేతలు ఆహ్వానించారు. ఆదివారం చిత్తూరులోని ఆయన నివాసంలో కాంగ్రెస్ పార్టీ నేతలు కలిసి ఆయన పార్టీలోకి ఆహ్వానించేందుకు వెళ్లారు. సీకే బాబు కాంగ్రెస్‌లోకి వస్తే జిల్లాలో పార్టీ మరింత బలపడుతుందని నేతలు తెలిపారు. అనంతరం ఆయన్ను సన్మానించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాంభూపాల్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాబు, జిల్లా అధ్యక్షుడు భాస్కర్, రాష్ట్ర మహిళా నాయకురాలు విక్టోరియా, రాణి, పూర్ణచంద్ర, చందు రాణి, ప్రభాకర్ తదిరులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.17 కోట్లు

తిరుమల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.17 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం లెక్కించి ఆదివారం ఉదయం ప్రకటించింది.శనివారం 71,021 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 25,965 మంది తలనీలాలు సమర్పించారు.





చిత్తూరు ఆర్టీసీ బస్టాండులో బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు - బస్సు ఎక్కేందుకు పోటీపడుతూ..

రెండోరోజూ బస్సుల్లేక..!

జిల్లాలో ప్రయాణికుల ఇబ్బందులు ● గంటల తరబడి బస్టాండ్లలో పడిగాపులు

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 18: అనంతపురం జిల్లా రాప్తాడులో జరిగిన సీఎం సభకు జిల్లాలోని 70 శాతం ఆర్టీసీ బస్సులతో పాటు ప్రైవేటు సర్వీసులను కేటాయించారు. దీంతో శనివారం మొదలైన ప్రయాణికుల కష్టాలు.. ఆదివారమూ కొనసాగాయి. ఆయా బస్టాండ్ల వద్ద బస్సుల్లేక బంద్ వాతావరణం కనిపించింది. ఏ బస్టాప్ చూసినా ప్రయాణికులతో కిక్కిరిసింది. గంటల తరబడి వేచివున్నా బస్సులు రాకపోవడంతో చివరకు ప్రయాణికులు ఆటోలపై ఆధారపడ్డారు. మరికొందరైతే రవాణా వాహనాలు, లారీల్లో ప్రయాణించారు. ఇక, కర్ణాటక, తమిళనాడు ఆర్టీసీ బస్సులు కిక్కిరిశాయి. అప్పుడప్పుడు వచ్చే మన ఆర్టీసీ బస్సులను ఎక్కేందుకు పోటీపడ్డారు.



వన్ టౌన్ పోలీస్ స్టేషన్ వద్ద ఉన్న బస్టాప్ వద్ద బస్సుల కోసం నిరీక్షణ

సీఎం సభ మా చావుకొచ్చింది

ఎక్కడో అనంతపురం జిల్లాలో సభ జరిగితే చిత్తూరు నుంచి జనాలను తరలించడం ఏంటో అర్థం కావడం లేదు. సీఎం సభ మాలాంటి ప్రయాణికుల చావుకొచ్చింది. చిన్న పిల్లలు, వృద్ధులు తాగునీరు, ఆహారం లేక బస్టాండల్లో ఉంటూ ఇబ్బందులు పడుతున్నారు. ఈ పాపం సీఎందే.

- జగన్, ప్రయాణికుడు

మూడు గంటలైనా ఒక బస్సూ రాలేదు



బస్సుల్లేక వెలవెలబోతున్న పలమనేరు ఆర్టీసీ బస్టాండు

పలమనేరు: బస్సుల్లేక పలమనేరు బస్టాండు ఖాళీగా కనిపించింది. గంగవరం మండలం కొత్తపల్లికి చెందిన రెడ్డెప్ప రెడ్డి వి.కోటలోని తమ బంధువుల ఇంటికి వెళ్లాలని ఆదివారం ఉదయం 10 గంటలకు పలమనేరు ఆర్టీసీ బస్టాండుకు చేరుకొన్నారు. మధ్యాహ్నం ఒంటి గంట అవుతున్నా ఒక్కబస్సుకూడా రాలేదు. ఎప్పుడు వస్తుందో కూడా ఆర్టీసీ అధికారులు చెప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

పరీక్షల్లో ఫెయిలవడం.. అమ్మ మందలింపు

● మనస్తాపంతో వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థిని ఆత్మహత్య



శశి (ఫైల్ ఫొటో)

తిరుపతి (నేరవిభాగం)/వెదురుకుప్పం, ఫిబ్రవరి 18: పరీక్షల్లో ఫెయిలవడంతో అమ్మ మందలించిందని.. మనస్తాపంతో వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థిని ఒకరు ఆత్మహత్య చేసుకున్నారు. తిరుపతి రూరల్ ఎస్‌ఐ నాగేంద్ర బాబు తెలిపిన ప్రకారం.. చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం తిరుమలయ్యపల్లె పంచాయతీ వేణుగోపాలపురానికి చెందిన టి.గోవిందరాజులు, మమత దంపతుల రెండో కుమార్తె టి.శశి(16). ఈమె తిరుపతి ఎస్వీ అగ్రికల్చరల్ కళాశాల హాస్టల్లో ఉంటూ, పాలిటెక్నిక్ మొదటి సంవత్సరం చదువుతోంది. ఇటీవల మొదటి సెమిస్టర్ పరీక్షలు రాసి సెలవుల్లో ఇంటికి వెళ్లింది. వారం కిందట వచ్చిన ఫలితాల్లో ఆమె ఫెయిలవడంతో తల్లి మందలించింది. మూడ్రోజుల కిందట హాస్టల్‌కు వచ్చిన ఆమె.. శనివారం రాత్రి ఇంటికి ఫోన్‌చేసి చాలాసేపు మాట్లాడింది. రాత్రి 12 గంటల వరకు చదువుకుని, సహ విద్యార్థినులతో కలిసి నిద్రకు ఉపక్రమించింది. ఆదివారం సెలవు కావడంతో అందరూ ఉదయం ఎనిమిది గంటలకు నిద్రలేచారు. అప్పటికే సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకున్న శశి కనిపించింది. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. 'ఇప్పటి వరకు తెలుగు మీడియంలో చదివాను. ఒక్కసారిగా ఇంగ్లిష్‌లో చదవాల్సి రావడం కష్టంగా ఉంది. అర్థం చేసుకోలేకపోతున్నాను. అందుకే పరీక్షల్లో కూడా ఫెయిల్ అయ్యాను. అమ్మ ఎప్పుడూ తిడుతూనే ఉంటారు. నావల్లనే కదా మీ అందరికీ అవమానం. నేనే వెళ్లిపోతా. మీరు సంతోషంగా ఉండండి' అంటూ ఆమె రాసిన సూసైడ్ నోట్ పోలీసులకు లభించింది.

అత్త చీరతో..: ఉరేసుకోవడానికి వాడిన చీర శశి అత్తదని పోలీసులు గుర్తించారు. ఊరినుంచి వచ్చేటప్పుడే ఈ చీరను తెచ్చుకున్నట్లు భావిస్తున్నారు. కాగా, కొన్నేళ్ల కిందట ఇద్దరు కుమార్తెలతో పుట్టింటికి చేరిన మమత.. ఇద్దరు పిల్లలను చదివిస్తున్నారు. రెండో కుమార్తె శశి ఆత్మహత్య చేసుకోవడంతో ఆమెతో పాటు బంధువులు రోదిస్తున్నారు.

25న గ్రూప్-2 ప్రిలిమ్స్

20 పరీక్ష కేంద్రాల ఎంపిక

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 18: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) ఆధ్వర్యంలో గ్రూప్-2 ప్రిలిమ్స్‌కు సంబంధించి ఈ నెల 25న ఆబ్జెక్టివ్ టైపులో స్క్రీనింగ్ టెస్ట్ పరీక్షలు జరుగుతాయని జిల్లా అధికార ప్రతినిధి తెలిపారు. ఇందుకోసం చిత్తూరు, బంగారుపాళ్యం, పలమనేరు, పూతలపట్టు ప్రాంతాల్లో 20 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు, పరీక్షలకు 9411 మంది అభ్యర్థులు హాజరౌతారని వివరించారు. జిల్లా రెవిన్యూ అధికారి పుల్లయ్య ఈ పరీక్షలకు నోడల్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తారని పేర్కొన్నారు. 25న ఉదయం 10.30 గంటల నుంచి 1 గంట వరకు జరిగే పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు.

పంట పొలాలపై ఏనుగుల దాడులు

ఐరాల, ఫిబ్రవరి 18: ఐరాల మండలం శివారు ప్రాంతమైన గూబలవారిపల్లెలో శనివారం రాత్రి ఏనుగులు పొలాలపై దాడులు చేశాయి. మామిడి, వరి, కొబ్బరి తోటలను తొక్కి నాశనం చేశాయి. చంద్రయ్యకు చెందిన మామిడి, కొబ్బరి చెట్లను విరిచేశాయి. అలాగే గుర్రప్పకు చెందిన కొబ్బరి చెట్లతో పాటు కౌలు రైతులు కిరణ్, హనుమంతుకు చెందిన మామిడి, వరి పంటలను నాశనం చేశాయి. అనంతరం ఏనుగులు అక్కడి నుంచి కల్లూరు రిజర్వ్ ఫారెస్టుకు వెళ్లి పోయినట్లు సమాచారం. దీనిపై ఎఫ్‌బీవో లావణ్య మాట్లాడుతూ రైతులకు త్వరలో నష్ట పరిహారాన్ని అటవీశాఖ ద్వారా అందిస్తామన్నారు.



గూబలవారిపల్లెలో వరి పంటను తొక్కేసిన ఏనుగులు

అరాచకాలు చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డిపై రౌడీషీట్ తెరవాలి

బీసీవై పార్టీ అధినేత రామచంద్రయాదవ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీసీవై పార్టీ అధినేత రామచంద్రయాదవ్

పుంగనూరు, ఫిబ్రవరి 18: ప్రశాంతమైన పుంగనూరులో అరాచకాలు, దోపిడీ, దౌర్జన్యాలకు పాల్పడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డిపై మొదటగా పోలీసులు రౌడీషీట్ తెరవాలని బీసీవై పార్టీ అధ్యక్షుడు బి. రామచంద్రయాదవ్ డిమాండు చేశారు. పుంగనూరులో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజాబలం లేకనే మంత్రి పెద్దిరెడ్డి అధికారాన్ని అడ్డంపెట్టుకుని నీచ రాజకీయాలు చేస్తున్నారన్నారు. ప్రశ్నించే వారిపై తప్పుడు కేసులు పెట్టిస్తున్నారని మండిపడ్డారు. బీసీవైపీ కార్యకర్తలకు కిట్ ఇవ్వడానికి గోడగడియారాలు తెప్పిస్తే.. ఎన్నికల కోడ్ రాకముందే నియమావళి ఉల్లంఘించారంటూ పోలీసులు సీజ్ చేశారన్నారు. వీటిలో కర్ణాటక మద్యంబాటిళ్లను పోలీసులు పెట్టి తప్పుడు కేసు పెట్టారన్నారు. సెర్చ్‌వారెంట్ ఇచ్చిన డీఎస్పీపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయగా విచారణకు ఆదేశించినట్లు తెలిపారు. నియోజకవర్గంలో అక్రమాలకు పాల్పడిన ప్రతి అధికారిపైనా ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసి వారిని ఎన్నికల్లో పుంగనూరులో లేకుండా న్యాయపోరాటం చేస్తామన్నారు. మంత్రి ప్రోద్బలంతో తనపై 47 తప్పుడు కేసులు పెట్టాడానికి సీఐలు రాఘవరెడ్డి, కృష్టారెడ్డి, గంగిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, డీఎస్పీలు సుధాకర్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, ఎస్పీ రిషాంత్‌రెడ్డి కారణమన్నారు. తనపై పెట్టిన కేసులన్నీ నిజాలైతే మంత్రి పెద్దిరెడ్డి ఆయన నమ్మే అయ్యప్పస్వామిపై ప్రమాణం చేస్తారా అని అన్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో దాదాపు 50మంది ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలపై రౌడీషీటర్లగా కేసులు నమోదు చేయించడం దారుణమన్నారు. సమావేశంలో నాయకులు సాంబమూర్తి, హరినాథరెడ్డి, హరియాదవ్, కిరణ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



తుమ్మలగుంట చెరువులో జరిగిన నిర్మాణాలు

తుమ్మలగుంట చెరువులో అనధికారిక నిర్మాణాలపై కొరడా?

● తొలగించాల్సిందేనన్న ఎన్జీటీ

తిరుపతి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట చెరువులో అనధికారిక నిర్మాణాలపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటీ) కొరడా ఝుళిపించింది. చెరువు స్వరూపాన్ని మార్చిన వారిపై చర్యలు తీసుకొని, నిర్మాణాలను తొలగించాలని సూచించినట్లు తెలుస్తోంది. దీనిపై ఏప్రిల్ 23వ తేదీలోపు నివేదిక ఇవ్వాలని కాలుష్య నియంత్రణ మండలితోపాటు కలెక్టరును ఆదేశించినట్లు సమాచారం. దీంతో తుడా అధికారులు నివేదిక సమర్పించడానికి తర్జనభర్జన పడుతున్నట్లు తెలుస్తోంది. గత ఏడాది సెప్టెంబరులో తుమ్మలగుంట చెరువులో ఏమి జరుగుతుందో వివరణ ఇవ్వాలని కలెక్టర్, తుడా, నీటి పారుదల శాఖను ఎన్జీటీ ఆదేశించింది. తుమ్మలగుంట చెరువు అన్యాక్రాంతమవుతోందని పలువురు స్థానికులు చేసిన ఫిర్యాదు మేరకు ఎన్జీటీ గతంలోనే సీరియస్ అయ్యింది. చెరువు స్టేటస్‌పై నివేదిక పంపాలని ఆదేశించింది. గత ఏడాది అక్టోబరులో తుడా నివేదికలు పంపినట్టు సమాచారం. అయితే వాటికి ఎన్జీటీ సంతృప్తి చెందనట్టు తెలుస్తోంది.

పూర్వాపరాలిలా..

తిరుపతి రూరల్ మండలం సర్వేనెంబరు 60లో 82 ఎకరాల విస్తీర్ణంలో తుమ్మలగుంట చెరువు ఉంది. దీనికి ఎగుదాల ఉండే పేరూరు చెరువు, స్వర్ణముఖి నుంచి కాలువల ద్వారా తుమ్మలగుంట చెరువుకు నీళ్లు వచ్చేవి. ఈ నీటితో తుమ్మలగుంట 180 ఎకరాల ఆయకట్టుతో పొలాలు పచ్చగా, గ్రామం పుష్కలంగా ఉండేది. భూగర్భ జలాలు బాగా అందుబాటులో ఉండేవి. ఇదంతా గతం. క్రమేపీ ఈ చెరువుకు నీళ్లు తెచ్చే కాలువలు అంతర్థానమయ్యాయి. చెరువు ఎండిపోయింది. తుమ్మలగుంట చెరువుకు రెండు నీటి సరఫరా కాలువలు ఉండేవి. స్వర్ణముఖి నుంచి పాత కాల్వ మీదుగా ఒకటి, పేరూరు చెరువు నుంచి అక్కగార్ల కళం కాలువ నుంచి మరో కాలువ తుమ్మలగుంటకు అనుసంధానమై ఉండేవి. చెరువులోకి నీళ్లొచ్చాయంటే రెండు కార్లు గట్టిగా పండించుకోవచ్చన్న ధీమా ఇక్కడ రైతులకుండేది. కాలక్రమంలో ఈ రెండు కాలువలు కబ్జాచేసి.. ఇళ్లు కట్టేశారు. దీంతో చెరువుకు నీరు చేరే అవకాశం లేకుండా పోయింది. ఆ చెరువు ఇప్పుడు కుర్రకారుకు సువిశాల ఆటస్థలంగా మారిపోయింది. 82 ఎకరాల చెరువులో 22 ఎకరాలను మునకపట్టాల కింద రైతులకు రెవెన్యూ అధికారులు అందించారు. తక్కిన 60 ఎకరాల్లో తుమ్మలగుంట స్థానికుడైన చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి గతంలో తుడా ఛైర్మన్‌గా ఉన్నప్పుడు చెరువును సుందరీకరణ చేయాలని భావించారు. ఈక్రమంలో చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ వేశారు. బోటింగ్ ఏర్పాటు చేయాలని చెరువును కొంత భాగం తవ్వారు. అంతేగాక జిల్లా క్రికెట్ అసోసియేషన్‌కు కొంత కేటాయించారు. నెట్ ప్రాక్టీసింగ్‌కు వినియోగిస్తున్నారు. ఏడాదికి ఒకసారి ఇక్కడ గ్రామీణ క్రికెట్ పోటీలు పెడుతుంటారు. ఈ నేపథ్యంలో చెరువు తన స్వరూపాన్ని కోల్పోయిందంటూ ఎన్జీటీకి ఫిర్యాదులు అందాయి. ఈక్రమంలో ఎన్జీటీ ఆగ్రహంపై ఎలాంటి నిర్ణయం తీసుకోనున్నారో వేచిచూడాలి.

ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవు : సీఐ

బి.కొత్తకోట,ఫిబ్రవరి18: బి.కొత్తకోట పట్టణంలో ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తప్పవని సర్కిల్ ఇన్స్పెక్టర్ సూర్యనారాయణ పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ బి కొత్తకోటలోని రంగసముద్రం రోడ్డు, బెంగళూరు రోడ్డులలో ద్విచక్ర వాహనాలు ఇష్టారాజ్యంగా రోడ్డుకు ఇరువైపులా పెడుతుండటంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందన్నారు. దీనిని అధిగమించేందుకు నగర పంచాయతీ కమిషనర్‌తో చర్చించి రోడ్డుకు ఇరువైపులా మార్జిన్‌లైన్‌ను వేయడం జరిగిందన్నారు. ఇకపై వాహనదారులు వారి ద్విచక్రవాహనాలను మార్జిన్‌లైన్ లోపల మాత్రమే ఉంచాలన్నారు. తోపుడు బండ్లు రోడ్డుకు అడ్డంగా పెట్టడానికి అనుమతిలేదని, ట్రాఫిక్‌కు ఆటంకం లేని దూరప్రదేశంలో బండ్లు ఉంచుకోవాలన్నారు. అదేవిధంగా దుకాణదారులు తమ వ్యాపార సామగ్రిని రోడ్డుమీద పెట్టకుండా దుకాణంలోపలనే ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. ఎవరైనా ఈ నిబంధనలను పాటించాల్సిందేనని, ఒక వేళ అతిక్రమిస్తే చర్యలు తప్పవని సీఐ పేర్కొన్నారు.

హంద్రీ-నీవా కాలువలో పడి విద్యార్థి మృతి


విద్యార్థి సుధీర్

కురబలకోట, ఫిబ్రవరి 18: హంద్రీ-నీవా కాలువలో పడి సుధీర్(16) విద్యార్థి మృతి చెందిన విషాదకర సంఘటన ఆదివారం మండలంలో జరిగింది. దీనికి సంబంధించి పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని తెట్టు పంచాయతీ పూజారవాండ్లపల్లెకు చెందిన సుధీర్ మదనపల్లెలోని ప్రైవేట్ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. కాగా ఆదివారం సెలవు కావడంతో తోటి స్నేహితులతో కలిసి గ్రామ సమీపంలోని కాలువలో చేపలు పట్టేందుకు వెళ్లాడు. అయితే కాలు జారి కాలువలో పడి మృతి చెందాడు. కాగా మృతదేహాన్ని కాలువ నుంచి వెలికి తీసి పోస్టు మార్టం నిమిత్తం మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు ముదివేడు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు జిల్లా టీ-20జట్టు సెలెక్షన్స్

వాల్మీకిపురం, ఫిబ్రవరి 18: మండలంలోని చింతపర్తి జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం ఉదయం 10గం టలకు జిల్లా టీ-20జట్టు సెలెక్షన్స్ నిర్వహించనున్నట్లు జిల్లా టీ-20 క్రికెట్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి అద్వైత్, ఆర్గనైజింగ్ కార్యదర్శి చిరంజీవి పేర్కొన్నారు. అండర్-19 సెలెక్షన్స్‌ను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. హాజరయ్యే క్రీడాకారులు తమ ఆధార్ కార్డు, రెండు పాస్ పోర్టు ఫొటోలను వెంట తెచ్చుకోవాలని తెలిపారు. ఇతర వివరాలకు సెల్ ఫోన్ 7842635338, 8374543595 నెంబర్లను సంప్రదించాలన్నారు.

సీటీఎంలో ఘనంగా ఉరుసు

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 18: మండలంలోని సీటీఎంలో హజరత్ ఖాజాసయ్యద్ నాదషా వలీ ఉరుసుఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉరుసు ఉత్సవాల్లో భాగంగా శనివారం సీటీఎం, రైల్వేగేటు వద్ద ఉన్న దర్గాలో గుర్రంమీద గంధం ఊరేగింపు నిర్వహించారు. మధ్యాహ్నం ఒంటిగంట నుంచి రాత్రి 11 గంటల వరకు అన్నదానం నిర్వాహకులు నిర్వహించారు. అంతకు ముందే దర్గాలోని సమాధులను ప్రత్యేకంగా అలంకరించి విశేషపూజలు, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బాబా వారి మజ్జార్‌పై పూలచదర్‌లతో ,విద్యుత్ అలంకరణ చేశారు. పురవీధుల్లోల ఫకీర్లతో ఊరేగింపుగా గంధాన్ని తీసుకెళ్లారు. అధిక సంఖ్యలో సీటీఎం పరిసరప్రాంతాల వాసులు ఉరుసు ఉత్సవంలో పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలి


సీటీఎం రేగంటివారిపల్లెలో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీనాయకులు

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 28: మండలంలో కాంగ్రెస్ పార్టీని బలోపేత చేయాలని పార్టీ రాజంపేట పార్లమెంట్ నాయకుడు, పుంగనూరు నియోజకవర్గ కన్వీనర్ సింగంరామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. సీటీయం గ్రామంలో రేగంటివారిపల్లెలో కాంగ్రెస్ పార్టీ ఇంటింటా ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఇందులో భాగంగా ఆదివారం రేగంటివారిపల్లెలో మహిళలను, యువకులను వృద్ధులను కలిసి కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని కోరారు. రాష్ట్రంలో వైసీపీ పాలనలో గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించలేదని ప్రజలు వాపోతున్నాట్లు ఆయన పేర్కొన్నారు. రాబోవు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని, దేశంలో రాహుగాంధీని ప్రధాని చేయడం లక్ష్యంగా ప్రజలు మద్దతుఇవ్వాలని కోరారు.. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీదేవి, సైదాని, ఈశ్వర్, నౌషిరా, ఖాసీ, రాజారెడ్డి, మంగేనాయక్, గుర్రప్ప, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆంజనేయస్వామి రథోత్సవం


రథాన్ని లాగుతున్న భక్తులు

నందలూరు, ఫిబ్రవరి 18: నందలూరులోని నూకినేని పల్లె పంచాయతీ కుంపినీ పురంలో వెలసిన వరాహ ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. రథాన్ని పూలతో సుందరంగా అలంకరించి స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని కొలువుదీర్చారు. రాష్ట్ర నలుమూలల నుంచే కాక, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర రాష్ట్రాల్లో ఉన్న వంశస్తులు రథాన్ని ఊరేగింపు నిర్వహించారు. కుంపినీపురం, మిద్దెల, బలిజేపల్లి గ్రామాల మీదుగా బాణాసంచా పేలుస్తూ, డప్పు వాయిద్యాల మధ్య ఊరేగింపు కొనసాగింది. ఈ సందర్భంగా జనసేన పార్టీ నియోజకవర్గ నాయకుడు అతికారి దినేష్ స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలను నిర్వహించారు. భక్తుల సౌకర్యార్థం స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అన్నదానం ఏర్పాటు చేశారు.

వైభవంగా సీతారాముల కల్యాణం

నందలూరు, ఫిబ్రవరి 18: మండలంలోని ఆడపూరు దిగువ హరిజనవాడలో జడ్పీటీసీ గడికోట ఉషారాణి, వెంకటసుబ్బారెడ్డి (జేసీబీ సుబ్బారెడ్డి) దంపతుల ఆధ్వర్యంలో ఆదివారం సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ మహోత్సవంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ ఆలయ నిర్మాణానికి దాదాపు రూ.10 లక్షలు జేసీబీ సుబ్బారెడ్డి దంపతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నందలూరు చైతన్య భారతిరెడ్డి, నందలూరు భాస్కర్‌రెడ్డి, నరసారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, రామచంద్రారెడ్డి, యానాదిరెడ్డి, రమణయ్య గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

బస్సుల్లేక ప్రయాణికుల తిప్పలు


మదనపల్లె ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సుల కోసం వేచిచూస్తున్న ప్రయాణికులు


ములకలచెరువలో రైలు కోసం వేచి ఉన్న ప్రయాణికులు


మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 18: మదనపల్లె ఆర్టీసీ వన్, టూ డిపోల నుంచి 76 బస్సులు అనంతపురం రాప్తాడు సీఎం సభకు తరలివెళ్లడంతో ఆదివారం ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో మదన పల్లె ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులు బస్సుల కోసం గంటల తరబడి వేచిచూడాల్సి వచ్చింది. ఇక బస్సులు లేక ప్రయాణికుల చాలా అవస్థలు పడ్డారు. దూరప్రయాణాలు చేసే ప్రయాణికులు గంటల తరబడి ఆర్టీసీ బస్టాండ్‌లో వేచి ఉండాల్సివచ్చింది. కొంతమంది ప్రయాణికులు ప్రైవేట్ వాహనాలు, ఆటోలను ఆశ్రయించి అధికంగా డబ్బులు వెచ్చించి తమ గమ్యం చేరాల్సివచ్చింది. ప్రైవేటు వాహనదారులు ఇదే అదునుగా చేసుకుని జనాల నుంచి అధిక ధరలు వసూలూ చేయడంతో ప్రయాణికులకు జేబులు చిల్లుపడ్డాయి.

ములకలచెరువులో: వైసీపీ సిద్ధం సభకు జనసమీకరణ కోసం ఆర్టీసీ బస్సులు వెళ్లడంతో ఆదివారం ప్రయాణికులు పడ్డ అవస్థ లు వర్ణణాతీతంగా మారాయి. బస్సులు లేక పోవడంతో బస్టాండుల్లో ప్రయాణికులు గంటల తరబడిగా నిరక్షించారు. ఎంత సేపటికీ బస్సులు రాకపోవడంతో విసిగిపోయి రైళ్లను ఆశ్రయించారు. మధ్యాహ్నం గుంతకల్లు - తిరుపతి, తిరుపతి-గుంతకల్లు మధ్య నడిచే ప్యాసెంజర్ రైళ్లలో ప్రయాణించారు. ప్రయాణికులు పెద్ద ఎత్తున తరలిరావడంతో ములకలచెరువు రైల్వేస్టేషన్ కిటకిటలాడింది. కాగా రెండు రైళ్లు కూడా గంట పాటు ఆలస్యంగా నడిచాయి. ప్రయాణికుల సౌకర్యాలు మరిచి సీఎం జగన్ సిద్ధం సభకు ఆర్టీసీ బస్సులు మళ్లించడం ఏమిటని పలువురు ప్రయాణికులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

పీలేరులో: ఆర్టీసీ బస్సులన్నీ సీఎం 'సిద్ధం' సభకు వెళ్లిపోవడంతో ఆదివారం కూడా పీలేరు ఆర్టీసీ బస్టాండులో ప్రయాణీకులకు తిప్పలు తప్పలేదు. పెళ్లిళ్లు, ఇతర పనుల కోసం తిరుపతి, మదనపల్లె, రాయచోటి, చిత్తూరు వంటి పట్టణాలకు వెళ్లాల్సిన ప్రయాణికులకు గంటలకొద్దీ పడిగాపులు తప్పలేదు. ప్రధానంగా మహిళలు, చిన్నపిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆర్టీసీ బస్టాండులోకి వచ్చిన అరకొర బస్సుల్లో సీట్ల కోసం వారు ఫీట్లు చేయాల్సి వచ్చింది. ఆర్టీసీ బస్సుల్ని నమ్ముకుంటే తిప్పలు తప్పవని గ్రహించి నాలుగు రోడ్ల కూడలికి చేరుకుని ప్రైవేటు వాహనాల్లో తమ ప్రయాణం కొనసాగించారు. పీలేరు డిపోలోని 85 బస్సుల్లో 62 బస్సులు 'సిద్ధం' సభ కోసం కేటాయించిన విషయం తెలిసిందే.

కలికిరిలో: ఆర్టీసీ బస్సులన్నీ రాప్తాడు సీఎం సభకు మళ్లించడంతో ఆదివారం ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పల్లెవెలుగు బస్సులతో సహా తిరుపతి, మదనపల్లెకు వెళ్లే సాధారణ, ఎక్స్‌ప్రెస్ సర్వీసు బస్సులు లేకపోవడంతో జనం పాట్లు అన్నీ ఇన్నీ కావు. మదనపల్లె పీలేరు మధ్య ఒకటి రెండు సాధారణ సర్వీసులు మాత్రం అతి కష్టం మీద రోడ్డు మీదకు రప్పించారు. ఇక సోమల కలకడ మధ్య తిరిగే షటిల్ సర్వీసు బస్సులు లేకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో ప్రయాణించాల్సిన వారు ఇక్కట్లపాలయ్యారు. ప్రత్యామ్నాయంగా ఎలాంటి వాహనాలు అందుబాటులో లేకపోవడం కూడా సమస్యగా మారింది. గ్రామీణ మార్గాలో ప్రయాణించాల్సిన వారు మాత్రం అక్కడక్కడా ఆటోలను ఆశ్రయించారు. శనివారం నుంచి మందకొడిగా తిరిగిన ఆర్టీసీ బస్సులు ఆదివారం పూర్తిగా రోడ్ల పైకి రాకపోవడంతో దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన వారు చివరికి ప్రయాణాలను రద్దు చేసుకోవలసి వచ్చింది.

బి.కొత్తకోటలో: అనంతపురం జిల్లా రాప్తాడులో ఆదివారం జరిగిన సీఎం జగన్ సిద్ధం సభకు ఆర్టీసీ బస్సులను తరలించడంతో బి.కొత్తకోట బస్టాండులో బస్సుల్లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పీటీఎం, ములకలచెరువు, మండలాలతోపాటు కర్ణాటక సరిహద్దు గ్రామాలైన గౌనిపల్లి, చింతామణి, కూరిగేపల్లి, రాయల్పాడు తదితర ప్రాంతాలకు రవాణా స్తంభించిపోయింది. ప్రయాణికులు, రైతులు, వ్యాపారులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వచ్చింది. మదనపల్లె-బి.కొత్తకోట మార్గంలో నడిచే సర్వీసులు బాగా తగ్గిపోవడంతో ప్రయాణికుల అవస్థలు వర్ణణాతీతంగా మారాయి.దూరప్రాంత ప్రయాణికుల అవస్థలు చెప్పడానికి వీలులేకుండా పోయాయి.


పీలేరు నాలుగు రోడ్ల కూడలిలో ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్న ప్రయాణీకులు

బాహుదా నదిలో బయల్పడిన మహావిష్ణువు విగ్రహం



కలికిరి, ఫిబ్రవరి 18: మండలంలోని బాహుదా నదిలో ఒక పురాతనమైన శ్రీమహావిష్ణువు విగ్రహం బయల్పడింది. మేడికుర్తి నుంచి ఎద్దులవారిపల్లెకు నది నుంచి వెళ్లే కాలి మార్గం సమీపంలో నదిలోని ఇసుక కింద ఐదడుగుల లోతులో ఈ విగ్రహం వెలుగులోకి వచ్చింది. మేడికుర్తి ప్రాజెక్టుకు 200 మీటర్ల దూరంలో ఎక్స్‌కవేటర్‌తో ఇసుక తవ్వుతుండగా విగ్రహాన్ని గుర్తించారు. దీంతో తవ్వకాలను ఆపేసి గుట్టు చప్పుడు కాకుండా వెళ్లిపోయారు. విగ్రహానికి సంబంధించిన సమాచారం అందడంతో వీఆర్వో శ్రీనివాసులు, తహసీల్దారు కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ హుస్సేన్ పీరా, పంచాయతీ కార్యదర్శి మయూరి, వీఆర్‌ఏ మల్లికార్జునలు నది ఇసుకలో కూరుకుపోయిన విగ్రహాన్ని వెలికి తీయించారు. విగ్రహాన్ని పరిశీలించగా శంకు చక్రధారిగా వున్న శ్రీమహావిష్ణువు విగ్రహంగా తేలింది. అయితే రెండు పాదాల భాగం పూర్తిగా విరిగిపోయి వుండటంతో విగ్రహం నిరర్థకమైందిగా గుర్తించి స్వాధీనం చేసుకోకుండా నదిలోనే వదిలేశారు.

పురాతన ప్రాశస్త్యమున్న మేడికుర్తి

మేడికుర్తి గ్రామానికి వందలాది ఏళ్ల క్రితంనాటి పురాతన ప్రాశస్త్యముందని చెబుతారు. ఇక గ్రామం నడిబొడ్డున పురాతన నరసింహ స్వామి ఆలయముంది. దీనికి సమీపంలోనే బాహుదా నది ఒడ్డున అత్యంత పురాతనమైన అగస్త్యేశ్వరస్వామి ఆలయం కూడా వుంది. ఈ నేపథ్యంలో కనుమరుగయిన శిథిలాలయాలకు సంబంధించిన విగ్రహమే వరద ప్రవాహాలకు కొట్టుకొచ్చి లోతైన ఇసుక మేటల కింది వుండిపోయనట్లు భావిస్తున్నారు. ఏదేమైనా పురాతత్వ శాస్త్రజ్ఞులు మేడికుర్తి ప్రాంతాన్ని పరిశీలించాలని పలువురు కోరుతున్నారు.

రెడ్డెమ్మకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

గుర్రంకొండ, ఫిబ్రవరి 18:సంతానలక్ష్మీగా పేరుగాంచిన రెడ్డెమ్మకొండ ఆలయంలో ఆదివారం అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను చేశారు. అనంతరం అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలను చేశారు. అమ్మవారు సంతాన లక్ష్మీ కావడంతో వివిధ ప్రాంతాల నుంచి మహిళా భక్తులు అధికంగా వచ్చి ఆలయంలో సంతానం కోసం వరపడ్డారు. అమ్మవారి కృపతో సంతానం పొందిన మహిళలు మొక్కులు తీర్చుకోవడానికి ఆలయానికి రావడంతో పరిసరాలు భక్తులతో రద్దీగా మారాయి. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

శ్రీనివాసుడికి వైభవంగా చక్రస్నానం

నేడు పుష్పయాగంతో ముగియనున్న బ్రహ్మోత్సవాలు


చక్రస్నానం నిర్వహిస్తున్న టీటీడీ వేదపండితులు, అర్చకులు

తంబళ్లపల్లె, ఫిబ్రవరి 18: తంబళ్లపల్లె మండలం కోసువారిపల్లె ప్రసన్న వేంకటరమణ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం స్వామివారికి వైభవంగా చక్రస్నానం చేయించారు. గత పది రోజులుగా విశేష పూజలందుకున్న శ్రీనివాసుడు సోమవారం సాయంత్రం నిర్వహించే పుష్పయాగంతో వార్షిక బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. టీటీడీ ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా టీటీడి వేదపండితులు వేకువజామునే శ్రీవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ధూపదీప నైవేద్యాలు సమర్పించి నిత్య కైంకర్యాలు పూర్తిచేశారు. అనంతరం శ్రీదేవీ, భూదేవీ సమేత శ్రీవారి ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా వసంతోత్సవం నిర్వహించి, స్వామి వారిని ఆలయ మాడ వీధుల్లో వైభవంగా ఊరేగించారు. తదనంతరం ఆలయంలో వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ శ్రీదేవీ, భూదేవి సమేత ఉత్సవమూర్తులకు, శ్రీవారి సుదర్శన చక్రతాళ్వార్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గంగాళంలోని జలంలో ముంచి చక్రస్నానం నిర్వహించారు. సాయంత్రం వెంకన్న ఆలయ ధ్వజస్తంభం పైకి బ్రహ్మోత్సవాల ఆరంభంలో ఎగురేసిన గరుడ ధ్వజపటాన్ని ధ్వజావరోహణం చేశారు. సోమవారం ఉదయం శ్రీవారికి స్నపన తిరుమంజనం, సాయంత్రం పుష్పయాగంతో వార్షిక బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ దిశంత్ కుమార్, ఉపప్రధాన అర్చకులు కృష్ణప్రసాద్‌భట్టర్, అర్చకులు రమేష్ స్వామి టీటీడీ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.


లక్ష్మీ నరసింహస్వామి అవతారంలో లక్ష్మీజనార్దనస్వామి



రామసముద్రం, ఫిబ్రవరి 18: రామసముద్రం మండల కేంద్రం లో వెలసి ఉన్న లక్ష్మీజనార్దన స్వా మి వారు లక్ష్మీనరసింహ అవతా రంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వ హించారు. ఆలయ ప్రధాన అర్చకు లు పార్థసారధిభట్టార్, కులశేఖర్‌భ ట్టార్ స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, ఊంజల్‌సేవ నిర్వహించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. స్వామివారిని చూసేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమాలు, రాత్రి సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా భజనలు నిర్వహించారు.

కరెంటు కోతలతో పంట ఎండుతోంది

● **ఆందోళనలో వేరుశనగ రైతులు**


చేతికొచ్చిన వేరుశనగ ఎండిపోతున్న దృశ్యం

చిన్నమండెం, ఫిబ్రవరి 18: ప్రభుత్వం రైతులకు 9 గంటల ఉచిత విద్యుత్‌ను అందిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్నప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు మాత్రం పూర్తి భిన్నంగా ఉన్నాయి. మండల వ్యాప్తంగా ఐదు సబ్‌స్టేషన్లలో వ్యవసాయ కరెంటును గత 10 రోజులుగా 7 గంటల మాత్రమే ఇస్తుండడంతో పంటలు ఎండుతున్నాయని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా వేరుశనగ రైతులు, టమోటా, మామిడి రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేరుశనగ కోత దశలో ఉన్నందున సరైన సమయంలో నీరు అందించలేకపోతే పంట పూర్తి స్థాయిలో దెబ్బతింటుందని, అసలే ఎండల తీవ్రత ఎక్కువ ఉన్నందున నీటి తడులు అందించాల్సి ఉందన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో కరెంటు సరఫరా 7 గంటలే ఇస్తే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. ఫిబ్రవరిలోనే కరెంటు కోతలు ఇలా ఉంటే ఇక ఏప్రిల్, మే, జూన్ నెలల్లో ఎలా అని రైతులు వాపోతున్నారు. దీనిపై డీఈ చంద్రశేఖర్‌రెడ్డిని వివరణ కోరగా... తాత్కాలికంగా కొన్ని సాంకేతిక ఇబ్బందుల కారణంగా పై నుంచి 7 గంటలు మాత్రమే వ్యవసాయ కరెంటు ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చారని, విద్యుత్ జనరేషన్ ఇంప్రూవ్‌మెంట్ అయిన వెంటనే పూర్తి స్థాయిలో రైతులకు 9 గంటల కరెంటు అందిస్తామన్నారు.

వైసీపీది ఉద్యోగ, ఉపాధ్యాయ వ్యతిరేక ప్రభుత్వం



కలికిరిలో నిరసన ప్రదర్శన చేస్తున్న ఏపీటీఎఫ్ సంఘం ఉపాధ్యాయులు

కలికిరి, ఫిబ్రవరి 18: వైసీపీ ప్రభుత్వం మొదటి నుంచి ఉద్యోగ, ఉపాధ్యాయల పట్ల పూర్తి వ్యతిరేక ధోరణితో పాలన సాగిస్తోందని ఏపీ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్ యాదవ్ ఆరోపించారు. ఆదివారం కలికిరిలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన ప్రదర్శన సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ నెలలోనూ సక్రమంగా జీతాలివ్వకుండా ముప్పుతిప్పలు పెడుతోందన్నారు. ప్రధానంగా డీఏలు. పీఆర్సీ బకాయిలు పెండింగ్ పెట్టి ఆర్థికంగా వేధిస్తోందని చెప్పారు. పీఎఫ్, ఏపీజీఎల్ఐసీలో ఉద్యోగులు దాచుకున్న డబ్బును వాడేసుకుందని, కనీసం ఖాతాల నిల్వలు కూడా చూసుకోవడానికి వీల్లేకుండా ఆన్‌లైన్ సైట్ స్తంభింపజేస్తున్నారని దుయ్యబట్టారు. మండల ఏపీటీఎఫ్ నాయకుడు శివప్రసాద్ సంఘం నాయకులు శంకర, సంషుద్దీన్, సహదేవ, గంగరాజు, మురళి, జనార్ధన్, శ్రీనివాసులు, నీలకంఠ, నిరంజన్, రెడ్డిమోహన్, వెంకట్రమణ తదితరులు పాల్గొన్నారు.

జనసేన పార్టీలో పలువురు యువత చేరిక


యువతను పార్టీలోకి ఆహ్వానిస్తున్న జనసేన నేత గంగారపు రామ్‌దాస్‌చౌదరి

మదనపల్లె, ఫిబ్రవరి 18: జనసేన పార్టీలో పలువురు యువత చేరారు. స్థానిక కమ్మవీధిలోని ఆ పార్టీ కార్యాలయంలో ఆదివారం రాయలసీమ కో-కన్వీనర్ గంగారపు రామ్‌దాస్‌చౌదరి సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీ యువ నాయకుడు షేక్ ఫాజిల్, ఆయన మిత్రుడు షారుఖ్ అధ్యక్షతన 50 మంది యువకులు చేరగా రామ్‌దాస్‌చౌదరి వారికి పార్టీ కండువా కప్పి స్వాగతించారు. ఈ సందర్భంగా రామ్‌దాసచౌదరి మాట్లాడుతూ జనసేన-టీడీపీ ఉమ్మడి కార్యచరణకు ఆకర్షితులై యువత పార్టీలో చేరినట్లు తెలిపారు. వచ్చే సాధారణ ఎన్నికల్లో జనసేన-టీడీపీ ఉమ్మడి అభ్యర్థి విజయానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. అధిష్ఠానం అభ్యర్థిని ప్రకటించిన తర్వాత పూర్తి స్థాయిలో ఉమ్మడి అభ్యర్థి విజయానికి కృషి చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ సెక్రటరీలు సనా ఉల్లా, గజ్జల రెడ్డెప్ప, రూరల్ అధ్యక్షుడు గ్రానైట్ బాబు, రూరల్ ప్రధాన కార్యదర్శి పవన్, శంకర్, విజయ్‌కుమార్, గంగులప్ప, మంజుల, నవీన్, నారాయణస్వామి, నరేష్, యాసిన్, ప్రవీణ్, మహేష్, హరీష్, సికిందర్, రెడ్డి, సిద్దిక్, అఫ్రాజ్, తౌసిఫ్, తదితరులు పాల్గొన్నారు.

జనసేన-టీడీపీ ఉమ్మడి ప్రభుత్వ ఏర్పాటుకు కృషి

● **జనసేన పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవంలో పార్టీ నేతలు**


జనసేన పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మైఫోర్సు మహేష్

మదనపల్లె, ఫిబ్రవరి 18: స్థానిక గొల్లపల్లెలో జనసేన పార్టీ కార్యాలయాన్ని ఆ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మైఫోర్సు మహేష్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు జె.భవానీప్రసాద్, రాజంపేట పార్లమెంటు అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేష్‌లతో పాటు మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు, పుంగనూరు, రాయచోటి నియోజకవర్గాల జనసేన నాయకులు పాల్గొన్నారు. ఈసందర్భంగా పట్టణంలో యువత స్కూటర్ ర్యాలీ స్థానిక జనసేన పార్టీ కార్యాలయం నుంచి నీరుగట్టువారిపల్లె మీదుగా గొల్లపల్లెకు చేరుకుంది. అనంతరం మైఫోర్సు మహేష్ మాట్లాడుతూ జనసేన-టీడీపీ ఉమ్మడి అభ్యర్థుల విజయానికి తామంతా కృషి చేస్తామని ప్రకటించారు. జనసేన-టీడీపీ కార్యకర్తలకు పార్టీ కార్యాలయం అందుబాటులో ఉంటూ ఓటర్ రిజిస్ట్రేషన్‌తోపాటు ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన అన్ని విషయాలను ఓటర్లకు దగ్గర చేస్తామన్నారు. జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో ఉమ్మడి అభ్యర్థుల విజయానికి కృషి చేస్తామని ఆయా నియోజకవర్గాల ఇన్‌ఛార్జిలు పేర్కొన్నారు. కార్యక్రమంలో చిన్నా రాయల్, పటాన్, నరేష్, చైతన్య, ఆదిత్య, కలప రవి, మోహన్ ప్రదీప్, కరుణాకర్, పార్టీ ఉమ్మడి జిల్లా లీగల్‌సెల్ అధ్యక్షుడు అమర్‌నారాయణ, శోభ, సునిత, నగీన, తోట కళ్యాణ్, మంజు, పతి, రతీఫ్, చిరంజీవి, సందీప్‌రెడ్డి, అయాజ్, జాఫర్, సికిందర్, తదితరులు పాల్గొన్నారు.

మన విలువైన ఓటు ప్రచారరథం ప్రారంభం


ప్రచారరథాన్ని ప్రారంభిస్తున్న సర్పంచి చిప్పిలి చలపతి, తదితరులు

మదనపల్లె, ఫిబ్రవరి 18: మన విలువైన ఓటు జిల్లా సాధనకోసం బహుజన యువసేన(బీవైఎస్) ఆధ్వర్యంలో ప్రచార రథం ప్రారంభమైంది. స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో ఆదివారం మండలంలోని కురవంక సర్పంచి చిప్పిలి చలపతి చేతుల మీదుగా పచ్చజెండా ఊపి ఈ రథాన్ని ప్రారంభించారు. అన్ని అర్హతలు ఉన్న మదనపల్లెను కాకుండా ఇతర ప్రాంతాన్ని జిల్లాగా ప్రకటించిన పార్టీకి గుణపాఠం చెప్పాలని బీవైఎస్ అధ్యక్షుడు పునీత్ పిలుపునిచ్చారు. మదనపల్లెను జిల్లాగా ప్రకటించే పార్టీలను గుర్తిస్తూ, మన విలువైన ఓటును రాబోయే ఎన్నికల్లో ఆలోచనతో వినియోగించుకుని మదనపల్లె జిల్లాను మనమే సాధించుకోవాలని పునీత్ పేర్కొన్నారు. కార్యక్రమంలో బీవైఎస్ నాయకులు హరీష్, సుధాకర్, గొల్లపల్లె శశి, విద్యాసాగర్, ముబారక్, బాలు, జగదీష్, గాంధీపురం శశికుమార్, సాదిక్, భరత్ పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంత నిరుద్యోగుల కోసమే స్టడీ మెటీరియల్


స్టడీ మెటీరియల్ అందజేస్తున్న గ్రంథాలయ చైర్‌పర్సన్ మధుబాల

కలికిరి, ఫిబ్రవరి 18: డీఎస్సీ పరీక్షలకు సమయం తక్కువగా ఉన్నందున గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువత కోచింగ్ సెంటర్ల పైన ఆధారపడకుండా ఉండడానికి స్టడీ మెటీరియల్‌ను అందజేసినట్లు ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ నైనారు మధుబాల సూచించారు. ఆదివారం స్థానిక శాఖా గ్రంథాలయంలో డీఎస్సీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువత అవగాహనా సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ ప్రైవేటు కోచింగ్ సెంటర్లతో మాట్లాడి అన్ని శాఖా గ్రంథాలయాల పరిధిలో కనీసం 500 మంది గ్రామీణ ప్రాంత అభ్యర్థులకు స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా అందజేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు వివరించారు. పుస్తకాల ఖర్చును తన స్వంత నిధులతో భరించనున్నట్లు పేర్కొన్నారు. కొంతమంది ముస్లిం మైనారిటీ విద్యార్థులకు ఉచితంగా కోచింగ్ ఇప్పించేందుకు కూడా ప్రయత్నిస్తున్నామని వెల్లడించారు. డీఎస్సీ అభ్యర్థులకు జిల్లా గ్రంథాలయ సంస్థ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కాగా కలికిరి గ్రంథాలయ శాఖ అధికారి విజయకుమార్ చొరవతో డీఎస్సీ అభ్యర్థులకు చేయూతనిచ్చే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ శాఖ అధికారి విజయకుమార్, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తండ్రిని కోల్పోయిన విద్యార్థినులకు ఆర్థిక సాయం


విద్యార్థినులకు ఆర్థిక సాయం అందజేస్తున్న రాజేంద్రనాయుడు

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 18: రోడ్డు ప్రమాదంలో తండ్రిని కోల్పోయిన ఇద్దరు విద్యార్థినులకు ఏపీ పాల ఏకరి సేవా సమితి సంక్షేమ సంఘం ఆర్థిక సహాయం అందించింది. ఆదివారం స్థానిక పాల ఏకరి సంఘం కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జన్నే రాజేంద్రనాయుడు మాట్లాడుతూ అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం కల్లూరుకు చెందిన నాగేంద్ర, పద్మావతి దంపతులు హైవే పక్కన చిన్న హోటల్ పెట్టుకుని ఇద్దరు కుమార్తెలను పోషిస్తున్నారన్నారు. చదువులో వీరిద్దరు బాగా రాణిస్తుండగా హఠాత్తుగా రోడ్డు ప్రమాదంలో వారి తండ్రి నాగేంద్ర మృతి చెందగా పిల్లలిద్దరు దిక్కులేని వారయ్యారన్నారు. ఈ విషయం తెలుసుకున్న పాల ఏకరి సంఘం నాయకులు పద్మావతి కుమార్తెలు తొమ్మిదో తరగతి చదువుతున్న సుధీష్ణ, ఆరో తరగతి చదువుతున్న రితిక ఉన్నత చదువులు చదివేంత వరకు తామే ఆర్థికంగా అండగా ఉంటామని హామీ ఇచ్చామన్నారు. ఇందులో భాగంగా విద్యార్థినులకు రూ.25వేలు నగదు అందజేశారు. కార్యక్రమంలో పాల ఏకరి సంఘం నాయకులు జి.చలపతి, ఎం.మల్లికార్జుననాయుడు, రాజేంద్రప్రసాద్, హరిబాబు, చంద్రశేఖర్, రఘుపతి, సదాశివ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కిలో రూ.480కి చేరిన వెల్లుల్లి

ములకలచెరువు, ఫిబ్రవరి 18: పేదలు, సామాన్యులకు, మధ్యతరగతి కుటుంబాలకు వెల్లుల్లి ఎక్కిళ్ళు తెప్పిస్తున్నాయి. కిలో రూ.480కి చేరడంతో పెనుభారంగా మారింది. 15 రోజుల క్రితం వరకు కిలో రూ.280 ఉన్న ధర అమాంతం పెరిగిపోయింది. దీంతో వెల్లుల్లి కొనడానికి వెనకడుగు వేస్తున్నారు.వెల్లుల్లి సాగు భారీగా తగ్గిపోవడంతో ధర పెరిగిపోయిందిని, ధర మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారస్థులు చెబుతున్నారు. ఏదిఏమైనా వెల్లుల్లి ధరలు దడ పుట్టిస్తున్నాయి.